
శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

శ్రీబాబూజీ మానసంలో పుట్టి భక్తిరస గంగగా
ఉప్పొంగిన ఆనందపథం - సాయిపథం











# కృప


20వ జన్మదిన సంచిక





ఆనందం వారి స్వరూపం - దివ్యత్వం వారి స్వభావం

# గమ్యం



బాబా పథంలో నడవడం అనేటువంటిదే గమ్యం. నడుస్తూ వుంటే, నిజంగా నడుస్తున్నామా? నడుస్తున్నామని అనుకుంటున్నామా? ఇంకా ఎంత బాగా నడవవచ్చు. మామూలుగా నడవడం కాదు. కొంచెం Cat walk చేస్తామా? దాంట్లో improvise చేసుకుంటూపోండి.

నడవడం అంటే ఊరికే నడవడం కాదు కదా! కుంటుతూ నడుస్తున్నామా? గెంతుతూ నడుస్తున్నామా? ఎట్లా నడుస్తున్నాము? అట్లా చక్కగా నడవడానికి ప్రయత్నం చేయండి. అదే గమ్యం! గమ్యం అంటూ వేరే ఏం ఉండదు. నేనెప్పుడూ మీ అందరికీ చెప్పేదొకటే, Means itself is a Goal.

ఎక్కడో ఆనందం వస్తుందని మనం ఇప్పుడు కష్టాలు పడుతున్నామా? ఎప్పుడో వచ్చేది కాదు, ఇప్పుడే మనకు ఆనందం కావాలి, Suffering through suffering, Happiness అనేది కాదు. Happiness through Happiness. కాబట్టి Meansను ఎక్కువ ఇది చేసుకోండి. ఇప్పుడు ఎట్లాగన్నా ఉండనీ మనం, అనేది కరెక్ట్ కాదు. Means are important.

ఇక గోల్ అంటావా, అది బాబానే చెప్పారు. "నువ్విలా ఉండు. నిన్ను చివరికంటా గమ్యం నేను చేరుస్తా" నన్నారు. "నువ్విలా ఉంటూ చివరికంటా గమ్యం చేరు" అని చెప్పలేదు ఆయన. 'నేనే చేరుస్తా' అన్నారు.

కాబట్టి మనకు అప్పుజెప్పినదేమిటి ఆయన? మార్గం గురించే. కాబట్టి take care of means. The end he will take care. ఆయన చూసుకుంటారు, లేకపోతే, మనకు ఇక్కడే ఉంది end, మనకు ఇదే end.


ఎంత చక్కగా ఉన్నాం మనం, ఎంత నిశ్చింతగా ఉన్నాం, ఎంత Happyగా ఉన్నాం, ఇందాక నేను చెప్పింది అదే. ఒక sense of securityతో, Happinessతో, ఏడుపు అనేది దగ్గరకు రానివ్వకుండా ఆనందంగా, మనకుండేటువంటి Happinessని పదిమందికి పంచుతూ, ఆ పంచడంలో ఇంకా happinessని మనం పొందుతూ ఉండగలిగితే చాలు. Happyగా ఉండండి.

–శ్రీబాబూజీ

సంపుటి : 20
సంచిక : 1

జనవరి 1
2017





# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో

4 పథగామి - గురుకృప
5 సహకారము - డాక్టర్ డి. వెంకట సూర్యారావు
7 గురుకృప - గురువు ... - గురుకృప
8 సాధకుని విధులు - శ్రీమద్భాగవతము
12 శ్రీబాబూజీ - డా॥ శ్రీనివాసులరెడ్డి
18 అనుభవం - శ్రీబాబూజీ
21 గురుకృపాలహరి - గురుకృప
28 ఆనందం - శరశ్చంద్రికలు
30 ప్రకృతి స్వభావం - సాయినాథుని శ్రుతి
35 కులాల కుళ్ళు - శ్రీబాబూజీ



నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు
GURUKRUPA
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

ఒక పట్టణం, వెలుపల ఒక చిన్న కుటీరం. అందులో ఎంత కాలంగా జీవిస్తున్నాడో ఒక సాధువు. ఆయన రోజుకొక్కసారి మాత్రమే ఊళ్లోకి భిక్షకోసం వెళ్ళి వచ్చేవారు.

ఒకరోజు ఒక భక్తుడు ఆయన ఉపదేశం పొంది ఆయనకు శిష్యుడవ్వాలనే ఆలోచనతో ఉదయాన్నే కుటీరం చేరుకున్నాడు. తలుపు వేసి వున్నది. అతడు కొద్దిసేపు వేచి వుండి, కొంచెం సంకోచిస్తూ, ధ్యానంలో ఉన్నారేమో అనుకుంటూనే, నెమ్మదిగా తలుపు తట్టాడు. "ఎవరక్కడ?" అన్న తీవ్రమైన కంఠధ్వని లోపల నుంచి వినిపించింది. 'నేను' స్వామి! అన్నాడా వ్యక్తి (భక్తుడు). "అయితే నేను చనిపోయాక రా!" అని సమాధానం వినిపించింది. తాను, తలుపు తట్టి సాధువుగారి ధ్యానానికి అంతరాయం కలిగించినందుకు కోపంతో ఆయనలా చెప్పి ఉంటారని తలచి, నొచ్చుకుంటూ వెళ్లిపోయి, కొన్నిరోజుల తరువాత–మధ్యాహ్నం ధ్యానాధికాలుండవనే తలపుతో ఆ సమయానికి కుటీరం వద్దకు వెళతాడు. అప్పుడూ తలుపువేసే వుంది. మరలా సంశయిస్తూనే తలుపు తట్టాడు. మరింత తీవ్రమైన కంఠధ్వని లోపల నుంచి "ఎవరక్కడ?" అంటూ వినిపించింది. భయంతో వణుకుతూనే 'నేను' స్వామి అన్నాడా భక్తుడు. "పో, ఇక్కడ్నించి, నేను చచ్చాక నీవిక్కడకు రావాలి!" అంటూ ఎంతో కోపంగా సమాధానం. ఆయన పద్ధతి ఇతనికేమీ అర్థం కాలేదు. సాధువుగారి మాటలు అంతరార్థం తెలుసుకొని, వారినుండి ఉపదేశం పొందాలనే ఆరాటంలో మరికొన్ని రోజులు గడిచాయి. ఈసారి సాయంసమయం, సూర్యాస్తమయం అయ్యేటప్పటికి కుటీరం చేరాడు. అప్పుడూ తలుపులు వేసే వున్నాయి. భయపడుతూనే నెమ్మదిగా తలుపు తట్టాడు. యధావిధిగా "ఎవరక్కడ? ఎవరు?" కంఠధ్వని వినిపించింది. "నేను స్వామి" అంటూ ఆశతో సమాధానం. "నీకు బుద్ధిలేదూ, నేను చచ్చిపోయాక నువ్విక్కడకు రావాలని ఇదివరకే చెప్పాను గదా?" ఈసారి అతడు కొంచెం ధైర్యం చేసి, "మీకు రోజూ పట్నంలో కనిపించే వ్యక్తే 'వీడు' స్వామి!" అన్నాడు. "మీరు చనిపోయిన తరువాత వీడొస్తే మీ దర్శనభాగ్యమెలా అవుతుంది?" అన్నాడు. నెమ్మదిగా తలుపులు తెరచుకున్నాయి. సాధు దర్శనమైంది. ఆయన ముఖాన తాండవించే చిరునవ్వు (పెదవులపై), అనంత ప్రేమలొలికించే ఆ చిన్న కళ్ళలోని ప్రేమ తళుక్కున మెరిసాయి. "బాబూ, నువ్వు చాలా చిన్నవాడివి, నీకు అర్థం కాలేదు. నీలోని 'నేను' నశించి తీరాలనే ఆ మాటల అంతరార్థం. ఇంతకు ముందటి 'నేను' మాటకు బదులు ఈసారి 'వీడు' అన్నమాట వినిపించింది. అందుకే తలుపులు తెరుచుకున్నాయి. రేపు రా, "ఉపదేశమిస్తాను" అన్నారా సాధువు. (సత్పురుషుల సాంగత్యమెంత గొప్పదో గమనిస్తే రెండుసార్లు, కొద్ది నిమిషాలపాటు ఈ ఉపదేశం కోసం వచ్చి

**విషయాలు తెలియడం కాదు ముఖ్యం. అవి అనుభవానికి రావడం ముఖ్యం.**



వెళ్లినంత మాత్రానే, దర్శనం లభించకపోయినా ఆ భక్తునిలోని అహం–'నేను' పల్చబడి అప్రయత్నంగా 'నేను' అనేమాటకు బదులు 'వీడు' అన్నది వచ్చింది చూసారా! ఉపదేశం లభించకపోయినా సాధువులను దర్శించాలన్న సత్సంకల్పం వల్లనే ఇంత మార్పు వస్తే, సుదీర్ఘ సాంగత్యంలో (constant touch... సాన్నిధ్యం) ఇంకెంత పరివర్తనో, పరిణితో కదా. అట్టి పరివర్తన, పరిణితులతో ప్రతి ఒక్కరినీ పరిపూర్ణుడిని చేసేందుకే వారు వచ్చినది. అతడే సద్గురువు.) అలా పౌర్ణమినాడు సాధువు దగ్గరకు వెళ్లగా ఆ భక్తుని ఆ సాధువు గంటసేపు రెప్పవాల్చక చూస్తూ ఉండిపోయాడు. అలా 'దృష్టిదీక్ష' లభించింది, అతడు తరించాడు. గురువుగారు మనవంక చూసారు అని ఆనందపడతామే గాని 'కృపాకటాక్ష వీక్షణదీక్ష' ఇచ్చారనే భావం కలుగుతోందా? ఆయన మాట్లాడారని సంతోషపడతామేగాని, 'వచనదీక్ష'గా గుర్తిస్తున్నామా? 'బాబా సూక్తులు' అంటూ వల్లెవేస్తూ, చెప్పుకుంటూ ఉంటామేగాని, అలా మనల్ని ఉండమన్నారని భావిస్తున్నామా? దర్శనమిచ్చారు అంటూ ఆనందమేగాని, 'ఆదర్శదీక్ష' ఇచ్చారనే భావన స్ఫురణ కలుగుతోందా? ఇలా ఆయన నిరంతరం మనకు నేర్పాలనుకుంటుంటే, మనలో నేర్చుకోవాలనే దృక్పథం ఒక దీక్షగా ఉంటే మన జీవితంలోని ప్రతి సంఘటనా సద్గురులీలా ప్రబోధంగా, వారి చెంతకు చేరువ చేసుకునే ప్రణాళికలో భాగమేనని స్వీకరించలేకపోతామా? మనం శిక్షణగా, బోధగా తలచడం మొదలుపెట్టిన మరుక్షణం ఓర్పుతో, శ్రద్ధతో (నిష్ఠ సబూరీలతో) గురువును ఆశ్రయించిన సచ్ఛిష్యుడు నేర్చుకోవాలనే దృక్పథంతో జీవితంలోని ప్రతి సంఘటనను బోధగా, శిక్షణగా మలుచుకొని ఎలా పరిణితి చెందుతాడో అవగతమవుతుంది.

అంతటితో అతడిలోని వ్యక్తిత్వం నామరూపాలు లేకుండా పోయి, 'విశ్వమంతా నేనున్నాను, విశ్వమంతా నాలోఉన్నది' అన్న సద్గురువాక్యం నిలిచిపోతుంది. అనంత ఆకాశంలో, అంతటా వ్యాపించిన వాయువులో, సద్గురు సర్వవ్యాపకత్వాన్ని దర్శిస్తూ, "అన్ని జీవులలో నేనున్నాను, అన్న గ్రహింపుకనుగుణంగా మసలుకొనే వారు నాకు ప్రీతిపాత్రులు" అన్న సద్గురు మాటల మననంతో చుట్టూ ఉన్న జీవులలో దైవాన్ని దర్శిస్తూ, అన్నిటా ఉన్న ఆ దైవం నాలోనూ ఉంది కదా! అన్న భావన ఉండిపోతాడు. తన దేహాన్ని దేవాలయంగా, తన హృదయాన్ని ఆయన పీఠంగా చేసి, తన గురువుని ప్రతిష్ఠించుకొని, సమీపంగా గడుపుతూ ఉండే ప్రయత్నమే సాధనగా గుర్తిస్తాడు. అదే ఉపాసన.. అదే ఉపదేశం (దగ్గరకు చేర్చుకునే మార్గం) పొందిన దానికి గురుతు. ఆ గురుతే గురువుగా దర్శనమిస్తున్నది, అని గ్రహించి, వారి మాటకు బద్ధుడై, వారు చూపిన పథంలో సాగిపోతాడు.



మరో సంఘటన చూద్దాం.... ఆశ్రమం లోపలనున్న సహనానికి ప్రతీక అయిన వశిష్ఠ మహర్షికి తలుపు చప్పుడు వినిపించి, 'ఎవరు' అన్న ప్రశ్నకు, "నేను" అన్న జవాబు వినిపించింది. అందుకు ఆ మహర్షి "నేనంటే" అని మళ్లీ ప్రశ్నించాడు. అది "తెలుసుకుందామనే మీ దగ్గరకు వచ్చాను" అని జవాబు చెప్పినవాడు శ్రీరామచంద్రుడు. ఇది గురుశిష్యుల అనుబంధం. నేర్చుకోవాలనే దృక్పథం, నేర్చుకునేలా చేసే కర్తవ్యం... ఈ దృక్పథంలో... ఆ కర్తవ్య నిర్వహణలో... అనుబంధం ఎరుకలోకి వస్తుంది, పెరుగుతుంది. నీవెవరివో, నీ కర్తవ్యమేమిటో తెలియజెప్పి ముందుకు నడిపించేవాడే సద్గురువు-అలా నడిచేవాడే సచ్ఛిష్యుడు. **- గురుకృప**

## సహకారము

పంచుకొనుటలో ఉన్న గొప్పతనమును తెలిపితివి. పంచుటకేమియు లేనివాడేమి చేయవలెను? పంచుకొనుటకు ఉండవలసినవి మంచి మనసేగాని-వస్తువులు, పదార్థములు కావు. సహకార మందించవలెనను మనసు, దానికి వలసిన సంసిద్ధత ప్రధానము. ఉన్నంతలో ఏదియైననూ ఇవ్వవచ్చును. లేనిదంటూ ఉండదు. మహాత్ముల జీవితము నందు ఇది గోచరించును. పరిసరములందు ఏ జీవియైనను ఆకలితో ఉన్నప్పుడు నీకున్న దానిలో కొంత పంచుట నేను మెచ్చు సంస్కారము. (ఆకలిగొన్న జీవులు ఆహారము కొరకై వెదుకుచుండును. వాటికి ఆహారం అందుబాటులో ఉంచడమే మనం చేయవలసినది - శ్రీబాబూజీ). దైవమే జీవుల రూపమున నీ సంసిద్ధతను పరీక్షించుచుండును, గమనించుచుండును. (సంసిద్ధతే - సిద్ధి). ఆ పరీక్ష మనమెక్కడ ఉన్నామో మనకు తెలియుట కొరకే గాని, వారు తెలుసుకొనుటకు కాదు, వారు సర్వజ్ఞులు కనుక సహకరించు సంసిద్ధతను పెంచుకొనుము. సంసిద్ధత ఉన్నచో ఏదియైనను పంచుకొనవచ్చును. అన్నము, వస్త్రము, దేహభాగములు, ప్రాణము పంచి ఇచ్చిన వారెందరో కలరు. అట్టి వారన్నచో భగవంతునికి ప్రీతి మెండు. వారికి పరాధీనుడు భగవంతుడు. కీర్తిప్రతిష్ఠల కొరకు పంచువాడు వ్యాపారియే. నా తండ్రి సామ్రాజ్యమున వ్యాపారులకు తావులేదు. (నన్ను నూనె వర్తకులు బాధించుచున్నారు. నేను శిరిడీని వదిలెదను - శ్రీసాయి) తనకున్నది పంచువాడు క్రమముగా తననే పంచును. అట్లు పంచువానికి నా తండ్రి సామ్రాజ్యమున పూజ్యస్థానముండును. శక్తి అయిపోవునని భావించువారికి, శక్తిని దాచుకొనవలెనని భావించువారికి శక్తి యొక్క అవగాహనము బొత్తిగా లేదని తెలియవలెను. శక్తిని పంచువానికి శక్తి కలుగుచు ఉండును. **- డాక్టర్ దామెర్ల వెంకట సూర్యారావు**

***20వ జన్మదినము సందర్భంగా 'గురుకృప' తన నూతన సంవత్సర శుభాకాంక్షలను పాఠకులకు అందిస్తున్నది.***

# గురుకృప - గురువు ఆగమనానికి గురుతు



మనసులో ఒక రకంగా, బయటకు మరో రకంగా వ్యక్తీకరణ. మనస్సులోని ఆలోచన, తలపు వేరుగా, మనం మాట్లాడే మాట వేరుగా, చేతలు వేరుగా ప్రవర్తిస్తూ మనసుకు–మాటకు, మాటకు–మనుగడకు మధ్య మనమే ఏర్పరచుకున్న అడ్డుగోడలే మన అజ్ఞానం, అవివేకం. కానీ ఇవే ఆయనను మనవాడిగా చూడనీయని అడ్డుగోడలు. ఈ అడ్డులు తొలగించుకునే నేర్పుని, సులువులను తెలిపి, మనల్ని తనవాడిగా, తనంతవాడిగా ఎదిగించేందుకు అదిగో **"శుభానంద సుధాకరునిగా, వివేక ప్రభాకరునిగా, అపార కృపాకరునిగా గురువు ఆగమనం.. అవతరణం"**. మన చెంతన నిలచిన ఆనంద స్వరూపం, తానే కోరి తన బిడ్డను చేరువ చేసుకోవడమే అనుగ్రహం. "అనుగ్రహించడమే నా అవతారకార్యం" అంటున్నది శ్రీసాయి దీనినే– ఇదే సాయిదీవెన.

అలా గురుదేవులు శ్రీబాబూజీ మన జీవితాలలోకి, జీవనంలోకి మన జీవన సారధిగా నిలిచేందుకు వచ్చారు. సుజ్ఞాన రత్నాలనందించు నీరధిగా, మోహములను దాటించు వారధిగా, సంస్కరిస్తూ, సమదర్శనాన్ని కలిగిస్తూ, నవత్వానికి, సమత్వానికి నాందీవాచకం పలుకుతూ శాంతిని పంచుతూ, ఆదర్శాల ఆచరణే చరణాలుగా నడయాడిన దైవం శ్రీబాబూజీ.

మోడువారిన జీవన వృక్షాలకు ఆశల చిగుళ్ళను తొడుగుతూ, నిరాశ, నిస్పృహ వడగాల్పులతో చెదరిన బ్రతుకులలో శాంతి, దాంతి, క్రాంతి దీపాలను వెలిగిస్తూ, నిత్యకళ్యాణ జీవనకాంతులను వెదజల్లుతూ 'గురుకృప' ప్రతిరోజూ ఆరంభ క్షణాన (మెలకువ రాగానే) మన జీవితాలలో ఎరుకగా, గురుతుగా, గురువుగా నిలబడి, తలపుల తలుపుతట్టి మరీ అందిస్తుంది. భక్తితో ఆహ్వానిద్దాం – శ్రద్ధతో ఆరగించి – సబూరీతో ఆస్వాదించి, జీర్ణించుకుందాం – ఆనందంగా జీవిద్దాం. ఆయనడిగిన రెండుపైసల దక్షిణ (శ్రద్ధ–సబూరీ) మన కొరకేగాని దానివల్ల ఆయనకొరిగేదేమీ లేదు అన్న సత్యం మన ఎరుకలోకి వస్తే (ఆయనకివ్వాలంటే మన దగ్గర ఉండాలి కదా) ఆయనకేమివ్వగలం – ఏమిచ్చి ఋణం తీర్చుకోగలం. కనుక ఈ ఋణం తీరేది కాదు. అందుకే ఈ ఋణానుబంధం – కరుణానుబంధంగా, ఆత్మీయానుబంధంగా అలానే పెరుగుతూ సాగుతుంది మన ప్రయత్నం లేకనే. **'నిన్ను ఎన్నటికీ విడువను'** అన్న అభయంలోనే ఆయన అనుగ్రహ అనురాగ కరుణానుబంధాన ఉన్న ఆంతర్యమే–మనలోని అంతర్యామిగా గ్రహిస్తే చాలు. అప్పుడే మనం అనుగ్రహం అందిపుచ్చుకున్న వాళ్ళం – తండ్రికి తగ్గ బిడ్డలం – అనుగ్రహవంతులం. ఆనందానికి ప్రతిరూపాలమవుదాం. ఆనందమే మన జన్మహక్కు అన్నారు కదా శ్రీబాబూజీ. (We are all grace worthy. Happiness is our birth right) – ఈ జీవితానికి సాఫల్యతను, ఈ జన్మకు చరితార్థతనందించ గల సమర్ధ సద్గురువులు వారు.

**–గురుకృప**



## సాధకుని విధులు

ఆ సమీపిస్తున్న శుకయోగీంద్రుడు పదహారు వత్సరాల దిగంబరమూర్తి. లోకులందరూ లోకాన్ని చూస్తూ ఉండగా, అతడు మాత్రం లోక రూపంలో వ్యక్తమవుతూ ఉన్న దైవ స్వరూపాన్నే చూస్తూ ఉన్నాడు. ఆపాదమస్తకం దివ్య సౌందర్యంతో తొణికిసలాడుతూ ఉన్నాడతను. **అందమే అలా రూపుకట్టిందా! ఆనందమే అలా ఆకృతి దాల్చి దిగివచ్చిందా!** అన్నట్లుగా ఉన్నాడతను. ఆ అవయవాల పొందిక, ఆ అపురూప సౌందర్యము, ఓహో! ఆశ్చర్యం.

నాకిది కావాలని ఎవరినీ అడిగి ఎరుగడతను. ఒకరు తనకు చేయలేదని ఎన్నడూ అనుకొని ఎరుగడతను. పదిమంది కలిసి కాలక్షేపాలు చేస్తున్న చోటులకు పోయి అందేమి జరుగుతున్నదని ఆత్రుతను చూపడు. ఎవరైనా వాదనలలోనికి దిగిన వేళలలో తానుగా ఏమీ మాట్లాడడు. వాదించుకొనుటలో వారు ఆనందమనుభవించుచున్న వేళ మనము అడ్డుపడటం ఎందుకని అలా ఊరకుండిపోతాడు. దైవయోగాన తనకు లభించిన దానితో తృప్తి పడతాడు. తానెంత తెలివిగల వాడైనప్పటికీ, విద్వాంసుడైనప్పటికీ, జీవితంలోని ఒడుపు తెలిసిన వాడైనప్పటికీ, ఏమీతెలియని వాడివలె తన మానాన తాను తనపనిలో నిమగ్నమై ఉంటాడు. ఇలా సాధకులైన వారందరికీ ఆదర్శ ప్రాయుడతడు. ఆధ్యాత్మిక మార్గంలో నడువగోరే వారందరికీ ఆ నడక ఎలా సాగాలో తెలియచెపుతున్న వాడతను.

ఆధ్యాత్మిక మార్గంలో నడవగోరినవాడు కొన్ని నియమాలు పాటించాలి. ఆ నియమాలే శుకయోగి నుండి దివ్యమైన గుణాలుగా ఎలా వ్యక్తమవుతున్నాయో ఇక్కడ వర్ణిస్తున్నాడు. ఈ మార్గములో నడువగోరిన వాడు ఇతరులు తనకేమి చేసారని ఆలోచించకూడదు. ఇతరులకు తానేమి చేయగలుగుతున్నానన్నదే గమనించుకుంటూ ఉండాలి. తోటివారు తనకు తగినట్లుగా ఉండటం లేదని వేష్టపడకూడదు. వారి వారి స్వభావాలను గమనిస్తూ, వారికి తగిన రీతిలో వారిని సద్వినియోగం చేయగలిగి ఉండాలి. తోటివారిపైన మనస్సులో ఎలాంటి **అభిప్రాయాలు** ఏర్పడకూడదు. అభిప్రాయాలంటూ ఏర్పడితే అవి ఇక నిలబడిపోతాయి. ఇక అభిప్రాయాలలో నుండి మనం వాళ్ళను చూస్తూ ఉంటాము. అప్పుడు మనం వాళ్ళలో వస్తున్న ఎదుగుదలను గమనించలేము. ఆ ఎదుగుదలకు దోహదమూ చేయలేము. తద్వారా మన ఎదుగుగలను కూడా వాయిదా వేసుకోగలము. అభిప్రాయం ఏర్పడటమంటే ఇంప్రెషన్ ఏర్పడటం. చూడండీ! ఇంప్రిజన్‌మెంట్ కన్నా ఈ ఇంప్రెషన్‌మెంట్



ఉన్నదే ఇది మా చెడ్డది. అంటే ఏమిటి? జైలులో నుంచయినా బయట పడవచ్చు కాని, కరడుగట్టిన అభిప్రాయాలలో నుండి బయట పడటం కష్టం. కనుక తోటివాళ్ళపైన అభిప్రాయాలు ఏర్పడకుండా జీవించడం చేతకావాలి. తేనెను ఇది నిజమైన తేనా? కల్తీ తేనా? అని చూడటానికి తెలిసిన వారు ఒక పరీక్ష చేస్తారు. మంచి రూపాయినోటు నొకదానిని దానిలో ముంచుతారు. అది నిజంగా మంచి తేనె అయితే ఆ రూపాయినోటుకసలేమీ అంటుకోదు. ఏ మాత్రం కల్తీ ఉన్నా నోటు మెత్తబడుతుంది. నోట్ ది పాయింట్. మనమలా మంచి తేనెలో మంచి నోటులా జీవించాలి. ఈ అంశాన్ని ఉపదేశిస్తూనే తామరాకుపై నీటిబొట్టులా జీవించమన్నాడు శ్రీకృష్ణుడు. అందరితో కలసి పనిచేయాలి. కాని ఎవరిపైనా ఇంప్రెషన్స్ ఏర్పడకూడదు. అభిప్రాయాలు ఏర్పడటం మొదలు పెడితే అవి మనలను అదమడం మొదలుపెడతాయి. అదుపు చేయడం మొదలు పెడతాయి. క్రమంగా మనలను బంధిస్తాయి. బంధాలుగా మారిపోతాయి. సంకెళ్ళయినా విడగొట్టుకోవడం తేలికగాని, వీటి నుండి విడవడటం కష్టమవుతుంది. ఇలా అభిప్రాయాల్లో ఇరుక్కొని ఉన్నామని మనలో చాలామందికి తెలియదు. అసలు అభిప్రాయాలు లేకుండా ఎలా జీవించగలం? అని మనకనిపిస్తుంది. నిజమే. అలవాటు పడిపోయిన తరువాత కష్టమే. చాలా రోజులపాటు జైలులో ఉండి విడుదలై వచ్చాడట ఒకడు. ఇంటి దగ్గర వాడికి నిద్రపట్టడం మానేసింది. కొన్నాళ్ళపాటు పెనుగులాడి చూసాడు, నిద్రపడుతుందేమోనని. కాని పట్టలేదు. ఇక లాభం లేదని క్రొత్తగా సంకెళ్ళను తయారు చేయించుకొని చేతులకు వేయించుకున్నాడట. అంతే! ఠక్కున నిద్రపట్టింది. అభిప్రాయాల కథా అలాంటిదే. వాటిలో అలవాటు పడిపోయిన మనకు అవి లేకుండా పోతే ఎలా? అని అనిపించడం సహజం. ఒక పట్టాన మానవుడు వాటిల్లో నుండి బయటపడాలని కోరడు. వాటితోనే రాగద్వేషాలను అనుభవిస్తూ, ఈర్ష్యాసూయలను వెళ్ళగ్రక్కుతూ, మద మాత్సర్యాలను ప్రదర్శిస్తూ, ఎవరినో ఏదో సాధిస్తున్నామనుకుని, ఎవరికో ఏదో చేసేస్తున్నామనుకొని బ్రతికి బ్రతికి, ఆ బ్రతుకులో తృప్తి దొరకక, అలసిపోయి, అలసిపోయి తీవ్రమైన తపన చెందిననాడుగాని, ఈ అభిప్రాయాలను విడిచిపెట్టడం ఎంత అవసరమో తెలిసిరాదు. నిజానికి సన్యసించవలసినది వీటినే. వీడు చెడ్డవాడు. వీడు అహంకారి. వీడు మోసగాడు. ఇవన్నీ అభిప్రాయాలే. ఈ కులం గొప్పది, ఈ కులం తక్కువది, ఇతడిని తాకవచ్చు, ఇతడిని తాకకూడదు. ఇవన్నీ అభిప్రాయాలే. ఈ సిద్ధాంతం గొప్పది. ఈ మతం గొప్పది. దీనిని మించిన సిద్ధాంతం లేదు. దీనిని మించిన మతం లేదు. మేము చెప్పేదే మతం. మేము నమ్మిందే



బృంద భావనే - బృందావనాన్ని తలపిస్తుంది.



దైవం. మా దైవం ద్వారా తప్ప మరెవ్వరూ తరించలేరు. మా మతం ద్వారా తప్ప ఎవ్వరికీ కన్ను తెరచుకోదు. మా సిద్ధాంతం ద్వారా తప్ప ఈ ప్రపంచానికి ముక్తి లేదు. విముక్తి లేదు. ఇవన్నీ అభిప్రాయాలే. చెప్పండి, **వీటిని సన్యసించడం ఎంత కష్టం. వీటిని సన్యసించడం ఎవరికిష్టం?** ఇందులో కొన్ని ఇనుప సంకెళ్ళున్నాయి. కొన్ని వెండి సంకెళ్ళు, కొన్ని బంగారు సంకెళ్ళున్నాయి. కానీ, అన్నీ సంకెళ్ళే. వీటిని సన్యసించడమే నిజమైన సన్యాసమవుతుంది. **మా తండ్రి గొప్ప అంటే ఇబ్బందేమీ లేదు. మీ తండ్రి కన్నా మా తండ్రే గొప్ప అంటేనే ఇబ్బంది. బట్టలు మార్చినంత మాత్రాన సన్యాసం రాదు.** బొట్లు మార్చినంత మాత్రాన సన్యాసం రాదు. లేదా బొట్టు తుడిచి వేసినంత మాత్రాన సన్యాసం రాదు. సన్యాసం భౌతికం కాదు. మానసికం. ముందు మానసికంగా వచ్చి, ఆ తరువాత భౌతికంగా వ్యక్తం కావలసింది అది. పలక మారుతున్న కాయకు చుక్కదిగినట్లుగా, అలా మనిషిని కాషాయం వరించాలి. గోపికా వస్త్రాపహరణం ఘట్టంలో కృష్ణుడు ఎత్తుకుపోయిన చీరలివే. ఈ అభిప్రాయాలనే వస్త్రాలను అతను ఎత్తుకుపోయాడు. **“అభిప్రాయాల కతీతంగా, దేహాభిమానాల కతీతంగా జీవించాలి మీరు”** అన్న ఉపదేశమే గోపికా వస్త్రాపహరణ ఘట్టంలో ఉన్నది. అభిప్రాయాలు ఏర్పడకుండా జీవించడం చేతనైన కొద్దీ లోకరూపంలో ఉన్న దైవరూపం మనకు గోచరిస్తుంది. ఈ భిన్నత్వంలోని ఏకత్వం మనకు సాక్షాత్కరిస్తుంది. అదిగో, ఆ దర్శనాన్ని, ఆ అనుభూతిని నిండుగా అనుభవిస్తూనే సాగుతున్నాడు శుకయోగి.

సాధకుడైన వాడికి తీరవలసిన ఆవశ్యకతలు ఉంటాయి. తీరని కోరికలు ఉండవు. ఈ శరీరం నిలబడటానికి కావలసిన **కూడు,గూడు,గుడ్డ–అవి ఆవశ్యకతలు.** అలాగే ఈ శరీరంతో పని చేయడానికి కావలసిన **అంగబలం, అర్థబలం– ఇవి ఆవశ్యకతలు.** ఇవికాక మిగిలినవి కోరికలు. ఏవి లేకపోయినా మనం బ్రతకగలమో అవి కోరికలు. ఏవి లేకపోతే మనం బ్రతకలేమో, బ్రతకడానికి అవకాశముండదో అవి ఆవశ్యకతలు. సాధకుడికి ఈ విభాగం తెలియాలి. ఈ విశ్లేషణ ఒంటబట్టాలి. కనుకనే శుకయోగి కోరికలు కోరనివాడుగా చెప్పబడ్డాడు. సాధకుడైనవాడు కుతూహలానికి లోనుకాకూడదు. పనిమీద బజారున నడిచి వెళుతూ ఉంటాం. మధ్యలో రోడ్డు మీద గుంపుగా చేరి జనం ఏదో కథను నడిపిస్తూ ఉంటారు. అదేమిటి? అని తెలుసుకోవాలనిపిస్తుంది. అక్కడేదో గొడవ పడుతూ ఉంటారు. ఆగి చూద్దామనిపిస్తుంది. సాధకుడైనవాడు ఇలాంటి కుతూహలానికి అతీతంగా ఉండాలి.



లేకపోతే ఎక్కడ ఏది జరుగుతుందో చూస్తూ ఉండటమే సరిపోతుంది. ఇంటికి వచ్చి వాటిని గూర్చి చెప్పుకోవడంతోనే సరిపోతుంది. ఇంతలో ఆయుర్దాయం అయిపోతుంది. కనుక ఇలాంటి **కుతూహలానికి** అతీతంగా **కర్తవ్యం** వెంట సాధకుడు సాగిపోతూ ఉండాలి. అందుకే శుకయోగి గుంపులలోనికి చొరబడని వాడుగా చెప్పబడ్డాడు.

వాదనా శీలం కలిగినవారు వాదించడంలో తమ శక్తియుక్తులను, సమస్తాన్నీ వెచ్చిస్తూ కాలాన్ని కలుషితం చేస్తూ ఉంటారు. **ఈ వాదనల వల్ల తెలిసేది ఏమీ లేదు, ఒరిగేది ఏమీ లేదు. జరిగేది ఏమీ లేదు.** ఎంత గొప్పగా వాదన జరిగినా ఒకరు మరొకరిని అంగీకరించడానికి సిద్ధంగా లేరు. మరి అలాంటప్పుడు వాదన ఎందుకు? అంటే అది వారి స్వభావం కనుక. సినిమాహాళ్ళ దగ్గర వివిధ నటుల అభిమానులు మోహరించి, మొహాలు జేవురిస్తూ ఉండగా తమతమ అభిమాన నటుల నటనా వైదుష్యాన్ని గురించి వాదించుకుంటూ ఉంటారు. ఓపికున్నంత సేపు వాదించుకుని అతికష్టం మీద అప్పటికి వాయిదా వేసి, వెళ్ళిపోతూ ఉంటారు. ఈ వాదన వల్ల ఏమి ఫలం? వారే చెప్పాలి. సిద్ధాంతాల గురించిన వాదనైనా అంతే.మతాల గురించిన వాదనైనా అంతే. ఏ రాయయితేనేం పళ్లూడగొట్టుకోవడానికి. కనుక సాధకుడైన వాడు వాదనల జోలికి, వాదించుకునే వారి జోలికి పోకూడదు. అది వృథా ప్రపంచం. దానిలో గడపడం వృథా. కనుకనే శుకయోగి అటుపోవడం లేదని చెప్పబడింది. (బాబా చరిత్రలోని హేమాడ్‌పంత్–భాటేల వృత్తాంతం గమనించుకుందాం).

సాధకుడైనవాడు **క్రమశిక్షణతో కర్తవ్యాన్ని నిర్వహించాలి. లభించిన దానితో తృప్తి పడాలి. మనం చేయవలసింది చేద్దాం. మనకు కావలసిందేదో భగవంతుడికి తెలుసు** – అన్న విశ్వాసం కలవాడే నిజమైన సాధకుడు. శుకయోగి అలాంటి 'తృప్తి' కలిగినవాడట. సాధకుడైనవాడు తన శక్తియుక్తుల్ని తగిన రీతిలో వ్యక్తం చేయాలి. తగిన చోటనే వ్యక్తం చేయాలి. ఆవశ్యకత ఉంటేనే వ్యక్తం చేయాలి.మిగిలినపుడు ప్రశాంతంగా తన మానాన తానుండాలి. అలా ఉండటం అతనికి చేతకావాలి. యుక్తాయుక్తాలతో నిమిత్తం లేకుండా ప్రతి చోటా తానేమిటన్నది ప్రదర్శించబోకూడదు. అతడేమిటన్నది, తెలియవలసిన వాళ్లకు మాత్రమే తెలియాలి. మిగిలిన వాళ్ళకు తెలియవలసిన పని లేదు గదా! వాళ్లతో వాళ్ళకు తగినట్లు ఉండగలగాలి. లేకపోతే వాళ్ళను ఇబ్బంది పెట్టినవాళ్లమవుతాం. శ్రీకృష్ణుని జీవితం ఇందుకు చక్కని ఉదాహరణ. గోపికలకు కావలసిన కృష్ణుడు గోపికల దగ్గరున్నాడు–అక్కడతడు



మానసచోరుడు. పాండవులకు కావలసిన కృష్ణుడు పాండవుల దగ్గరున్నాడు– అక్కడతను శిక్షకుడు. యాదవులకు కావలసిన కృష్ణుడు యాదవుల దగ్గర ఉన్నాడు– అక్కడతను రక్షకుడు. ఋషులకు కావలసిన కృష్ణుడు ఋషుల దగ్గర ఉన్నాడు– అక్కడతను పరాత్పరుడు. కుచేలుడికి కావలసిన కృష్ణుడు కుచేలుడి దగ్గర ఉన్నాడు– అక్కడతను ఆప్తమిత్రుడు. సత్యభామ దగ్గర కావలసిన కృష్ణుడు సత్యభామ దగ్గర ఉన్నాడు– అక్కడతను ఒదిగి నడుచుకునే భర్త. రుక్మిణి దగ్గర కావలసిన కృష్ణుడు రుక్మిణి దగ్గర ఉన్నాడు– అక్కడతను పతిదేవుడు. బలరాముడి దగ్గర కావలసిన కృష్ణుడు బలరాముడి దగ్గర ఉన్నాడు– అక్కడతను చిన్నితమ్ముడు. ఇలా ఎవరికి ఎలా అవసరమో వారికి అలా వ్యక్తమవుతూ సాగిపోవటమనేది సాధకుని పరమావధి. దీనినే ఔచిత్యమంటారు. ఉచితమైన ప్రవర్తన అంటారు. సందర్భోచితంగా నడచుకోవడమంటారు.

కారణ జన్ముడైన ఆ శుకయోగి నుండి అలౌకికమైన సౌందర్యం అలా అలవోకగా వ్యక్తమవుతుంది. లోకులు అందంగా కనబడటానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు కదా! కాని అందమే ఆర్తితో వచ్చి అతడి నుండి కనబడాలని ప్రయత్నం చేస్తోందట. అలాంటి అలౌకికమైన అందాన్ని చూస్తూ ముక్తికాంతే మోహపడుతూ ఉంటే, ఇక 'ఉత్తి' కాంతల సంగతి వేరే చెప్పాలా! అన్నట్లుగా ఉందట ఆ దృశ్యం. లోకంలో ఇరుక్కుపోవడమనే వెర్రితనానికి అతీతంగా, విజ్ఞానమే ఆకారం దాల్చిందా అన్నట్లుగా పరబ్రహ్మానుభూతిలో తుష్టుడై సాగుతున్నాడు శుకయోగి! ***(శ్రీమద్భాగవతము దివ్యజీవన మార్గం)***

## శ్రీబాబూజీ

***(ఆరాధనోత్సవ సంచిక తరువాయి భాగం)*** ఒకసారి గురువుగారితో తిరుమలకు వచ్చే భాగ్యం కలిగింది. మేము వచ్చినరోజు బస్సులు రావడం లేదు. ఏదో కొట్లాట జరిగి మూడు రోజులు బస్సులు నడవలేదు. తిరుమలలో షాప్స్ అన్నీ మూసివేసారు. తిరుపతి నుండి పైకి వచ్చేవాళ్ళే లేరు. మొత్తం తిరుమలలో రెండు మూడు వందల మంది ఉంటారు. అప్పుడు స్వామి సన్నిధిలో ఎంతోసేపు గడపగలిగాము. ఆ రోజు మా గురుబంధువు చెప్పిన లీలను ప్రత్యక్షంగా నేను చూచాను. ఎన్నోసార్లు, ఎంతో సేపు స్వామివారి సన్నిధిలో గడిపాము.



గురువుగారు ఒక్కరే శిరిడీలో ఎక్కువకాలం గడుపుతూ అమ్మగారు, పాప ఒంగోలులో ఉంటూ అప్పుడప్పుడూ ఒంగోలు వస్తూ, 1989 సం॥ మొత్తం ఫ్యామిలీతో గురువుగారు శిరిడీలో ఉండిపోదామని అనుకున్నపుడు ఒకరోజు రాత్రి గురువుగారికి ఒక దివ్యస్వప్నం వచ్చిందట. సామాన్యంగా కలలు రావని, వచ్చినవి మాత్రం చాలా స్పష్టంగా గుర్తుంటాయని చెప్పారు. ఆ కల సారాంశం ఇదే. ఒక పెద్ద మందిరం వద్దకు పోవడానికి ఎన్నో దారులున్నాయట. ఎందరో ప్రజలు చీమలబారులులాగా తండోపతండాలుగా వస్తున్నారట. ఆ మందిరంలోనికి మాత్రం ఎవ్వరూ పోలేకపోతున్నారట. కారణం గర్భాలయానికి పోయే మార్గం చాలా ఇరుకైనది. దానిగుండా ఒక్కొక్క మనిషి ప్రాకుకుంటూ పోవాలి. ఎవ్వరూ ఆ సన్నటి మార్గం గుండా పోలేక ఆగిపోయి ఉన్నారట. వాళ్ళలో గురువుగారు కూడా ఉన్నారట. వారు ఒక్కరే కన్నంలాంటి ఆ మార్గంగుండా నెమ్మదిగా పాకుకుంటూ గర్భాలయంలోనికి పోయారట.అక్కడ పెద్ద విగ్రహం పడుకొని ఉంది. దాని ఎదురుగా గురువుగారు ఉన్నారు. విగ్రహాన్ని చూడగానే గురువుగారు సాష్టాంగనమస్కారం పెట్టుకున్నారట. నమస్కారం చేసుకొని లేచి చూస్తే స్పష్టంగా తిరుమలలో ఉన్న అనుభూతి కలిగిందట. వెంటనే మెలుకువ వచ్చిందట. మెలుకువ రాగానే కూడా తిరుమలలో ఉన్న ఫీలింగ్ ఉండినదట. సాక్షాత్ సమర్థ సద్గురు సాయినాథుని నివాసమైన శిరిడీలో పర్మినెంటుగా నివసించడానికి పోయేముందు ఇలా కలరావడం కేవలం బాబా సంకల్పమనిపించి తిరుమలకు వెళ్లారట. అమ్మగారు, శృతి, నేను కూడా కలిసివెళ్లాము. గురువారం నాడు స్వామివారి **'నేత్ర'**దర్శనం చేసుకొని బయటకు వస్తుంటే అప్పుడే అన్నదాన కూపన్‌లు ఇచ్చారు. వాటిని బయట ఎవ్వరికైనా ఇచ్చి మేము హోటల్లో భోంచేద్దామని బయలుదేరపోతుంటే గురువుగారు ఇలా అన్నారు "ఇవి స్వామి ప్రసాదం. అన్నదానం చేస్తున్నారు, అక్కడే తిందామని" అంటే అందరం పోయి స్వామి ప్రసాదాన్ని తిన్నాము. గురువారం స్వామి విగ్రహానికి అలంకరణలన్నీ తీసివేసి ఒక్క వస్త్రం మాత్రమే కడతారు. పెద్దనామం తీసివేసి సన్న నామం పెట్టి ఉంటారు. అందుకనే దాన్ని **'నేత్రదర్శన'**మంటారు అని చెప్పి, **"గురువారం స్వామి గురుస్వరూపంగా"** ఉంటారు, ఆ రోజు స్వామిని దర్శించుకుంటే మంచిదని గురువుగారు చెప్పారు.

తిరుమల గర్భగుడిలో వున్న విగ్రహం నిలబడి వుంటుంది. కాని వారికి వచ్చిన స్వప్నంలో విగ్రహం పడుకొని వుంది. ఎందుచేత? దానిలోని భావం ఏమిటి? అని గురువుగారు తిరుమలలో స్వామివారికి సంబంధించిన ఎన్నో పుస్తకాలు కొనుక్కొచ్చారు. వాటినంతా చదివి వారు రిఫర్



చేసుకోవడానికి తిరుపతిలోని యూనివర్సిటీలోని ఎన్నో బుక్స్ తెప్పించుకొని చదివి, ఎంతో ఓర్పుతో ఎన్నో సమన్వయం కాని విషయాలను ఆలోచించి, చివరకు ఒక నిర్ణయానికి వచ్చారు. ఇది అంతకుముందు ఎవ్వరు ఆలోచించని అంశమిది. బాబా తమ గురువు "వెంకూసా" అన్నారు. ఆ 'వెంకూసా'నే మన వెంకటేశ్వరస్వామి. అంత పేరు పలకలేక మహరాష్ట్రలోని వారు స్వామిని వెంకూసా అని అంటారు. ఎన్నో వందల సంవత్సరాల క్రితం సమాధి చెందిన మహనీయులే "వెంకూసా" అని గురువుగారి పరిశోధనలో తేలిన విషయం. వెంకూసాకు బాబాకు వున్న అనుబంధం వలననేమో మన ఆంధ్రులు ఎక్కువగా శిరిడీకి పోవడం, మహరాష్ట్రులు ఎక్కువగా తిరుమల వచ్చి బాలాజీని సందర్శించుకోవడం. తిరుమల బాబాకు గురుస్థానం కాబట్టే గురువుగారికి స్వప్నదర్శనం కావడం,తరుచుగా గురువుగారు తిరుమలను సందర్శించుకోవడం. కొంతకాలం ఇక్కడ గడపడం జరుగుతున్నది. గురువుగారు శిరిడీ తర్వాత ఎక్కువకాలం గడిపే ప్రదేశాలు ఒకటి **అరుణాచలం**, రెండు **తిరుమల**. ఈ రెండు దివ్యక్షేత్రాలకూ గురువుగారికి ఉన్న ఋణానుబంధం ఏమిటో మనకు అర్థం కాదు. ఎన్నో జన్మల అనుబంధం అనిపిస్తుంది.

**నిజమైన ఆధ్యాత్మికత బాహ్యమైన ఆడంబరాలకు కాక అంతరంగంలో జరిగే మథనానికి ప్రాముఖ్యత నిస్తుంది.** అందుకనే గురువుగారు ఎప్పుడూ షోడశోపచార పూజలాంటి తంతులను ప్రోత్సహించరు. చేసుకోమని చెప్పరు. మన ఇష్టదైవాన్ని మనస్సులో నిలుపుకొని సాధ్యమైనంత ఎక్కువసేపు మానసిక పూజ చేసుకోమంటుంటారు. ఆ ప్రక్రియ ద్వారా మనస్సు దైవం మీద ఏకాగ్రంగా కుదిరి పూజ చేస్తున్నంతసేపు దైవధ్యానం జరిగినట్టు అవుతుంది. సాయిబాబా లాంటి సద్గురుమూర్తే మన ఇష్టదైవం అయినప్పుడు మనకు ఇంకా ధ్యానం చాలా సులభం అవుతుంది. మనం వారి రూపాన్ని తలచుకొన్నపుడు వారి రూపమే కాక వారి అద్భుతలీలలు, ఆ లీలల వెనుక దాగి వున్న అద్వితీయమైన వారి మహిమ, వీటి ద్వారా ప్రకటమైన వారి ఆనందస్థితి అన్నీ మనస్సుకు వచ్చి వారి రూపం అప్రయత్నంగా మన మనస్సులో నిలుస్తుంది. బాబా రూపాన్ని ఎంతోసేపు మనస్సులో నిలుపుకొనే శక్తిసామర్థ్యాలు వాటంతట అవే వస్తాయి. అదే బాబా చెప్పిన "ఎదురుగా ఉన్న నా రూపాన్ని మనస్సులో నిలుపుకో" అన్న సాధనలో సులువు. అందుకనే మానసికపూజ చేసుకొమ్మని చెప్పడం. పూజ తరువాత బాబాను మనస్సులోనే ప్రతిష్టించుకొని ఎంతసేపు వీలుంటే అంతసేపు చూస్తూ ఉండడం. అది మొదటిమెట్టు.



అలా చేసిన తరువాత ఆ భావాన్ని చెదరనీకుండా బాబా చరిత్రను చదువుతూ, లీలలను ఆస్వాదిస్తూ, ఆ లీలలను ప్రదర్శించిన బాబా మహిమను, ఆద్భుతమైన బాబా స్థితిని మనస్సుకు తెచ్చుకొని సాధ్యమైనంతవరకూ ఆ స్థితిని మనం అనుభవించగలగాలని ప్రయత్నించడం, అవ్యాజమైన బాబా ప్రేమను మనం పొందాలన్న తపనతో సాయిని ప్రేమించగలగడం. 'సర్వజీవులలోనూ వున్న చైతన్యమే బాబా' అన్న ఎఱుకతో 'మనలో ఎలా వున్నారు' అని అంతర్ముఖమై 'హృదయంలో సాయిని చూడగలగడమే' **సాధన** అని గురువుగారు చెబుతుంటారు. అదే బాబా చెప్పిన **"నన్ను ఆనంద స్వరూపంగా ధ్యానించు"** అన్న సాధన. మనం ప్రయత్నించే కొలదీ మనస్సు హృదయగతమై సచ్చిదానందస్వరూపమైన బాబా అద్భుత ఆనందస్థితిని మనలో చూడగలం.

ఇదంతా మనంతట మనం, ఎవరికి వారుగా అంతరంగంలో చేసుకోవలసిన ప్రక్రియ తప్ప బాహ్యంగా చేసుకోవలసింది గాదు. అందుకనే బాహ్య ఆడంబరానికి చిహ్నాలైన నొసటన విభూతినామం, బొట్లు, రుద్రాక్ష మాలాధారణలాంటి వాటిని గురువుగారు ప్రోత్సహించరు సరిగదా నిరసిస్తారు. **మనం చేసుకుంటున్న సాధన మనలను ఉద్ధరించేందుకు చేసుకోవాలి తప్ప ఎదుటివాళ్ల దృష్టిలో మనం గొప్ప సాధకులమని అనిపించుకోవడానికి కాదు అని అంటారు గురువుగారు.** గురువుగారిని మార్గదర్శిగా తీసుకొని సాధన చేసుకుంటున్నవారు ఎవ్వరూ ప్రపంచానికి సాధకులుగా అగుపించరు. **'సాధన' అంటే ముక్కు మూసుకొని, కళ్లు మూసుకొని చేసుకొనేదికాదనీ, మనలో ఉన్న ఎన్నో రకాల సంస్కారాలను సంస్కరించుకోవడమని. భయాలను, ఆందోళనలను పోగొట్టుకొని సద్గురువుకు మన మనసు యొక్క పగ్గాలను అప్పచెప్పి, నిశ్చింతగా ఉండటమనీ గురువుగారు చెపుతుంటారు.** ఎన్నో తరాలనుండి పెద్దలు ఆచరిస్తూ, చిన్నప్పటినుంచి మనకు నూరిపోసిన ఎన్నో మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలు మనలో డీప్‌గా పాతుకొని మానసికంగా మనం ఎదగకుండా చేస్తాయి. వాటిని మనలోనుంచి పోగొట్టుకొనేలా చేసి మానసికంగా చైతన్యవంతులమై సద్గురువుకు సంపూర్ణ శరణాగతి చెందేటట్లు చేయడం మనలను ఎన్నుకొన్న గురువుగారు చేస్తున్న పని. అందుకే పలు సందర్భాలలో ఈ నమ్మకాల వెనుకనున్న గాథ ఏమిటో, ఏ విధంగా ప్రారంభమై ఇప్పుడు ఏ రూపాన్ని సంతరించుకున్నాయో చెపుతుంటే ఎంతో ఆశ్చర్యకరంగాను, అర్థం తెలియక ఆచరిస్తున్న మనకు నవ్వు కలిగించేదిగాను ఉంటుంది. ఉదాహరణకు మనం ఏదైనా ప్రయాణానికి పోబోయే



ముందు ఎవ్వరైనా తుమ్మితే దానిని అపశకునంగా భావించి కాసేపు కూర్చొని, నీళ్ళు తాగి బయలుదేరుతాము. ఆ పని ఎంత అర్జంటుదయినా సరే ఆలోచించకుండా కూర్చొని బయలుదేరతాము. కారణం అలా తుమ్మితే మనం అనుకున్న పని సక్రమంగా జరగదని మన విశ్వాసం. తార్కికంగా ఆలోచిస్తే ఇది ఎంత అసంబద్ధమో తెలుస్తుంది. కారణం ఎవ్వరో తుమ్మితే మనం పని మాని కూర్చోవడం ఏమిటి అని ఎవ్వరూ ఆలోచించరు. ఆలోచిస్తే అలా కూర్చోము. కాని ఈ మూఢనమ్మకం వెనుక ఉన్న అర్ధమేమిటంటే పూర్వకాలం వాహన సదుపాయం లేక ఎంతదూరమయినా ఎద్దులబండి కట్టుకొని పోతున్న రోజులలో దూరప్రయాణానికి బయలుదేరుతున్న వ్యక్తి ప్రయాణం అవుతున్న సమయంలో తుమ్మితే ఆ తుమ్మడం అనారోగ్యానికి సంకేతమని, ప్రయాణంలో వైద్య సదుపాయం లేక అనారోగ్యం పాలై ప్రయాణానికి ఆటంకం కలుగుతుందని అందుచేత ప్రయాణాన్ని వాయిదా వేసుకొని ఆరోగ్య పరిస్థితి కుదుటపడిన తరువాత తిరిగి ప్రయాణం చేసేవారు. అది ఎన్ని రోజులయినా సరే సంపూర్ణ ఆరోగ్యవంతుడైన తరువాతే ప్రయాణానికి సిద్ధమయ్యేవారు. ప్రయాణంలో వైద్య సదుపాయం లేని రోజులు కాబట్టి ప్రయాణం చేసే వ్యక్తి మాత్రం ప్రయాణం వాయిదా వేసుకొనేవారు. ఈనాడు మనం ఎవరో తుమ్మితే మన ప్రయాణం కాసేపు వాయిదా వేసుకునే స్థితికి వచ్చాము. నిజంగా ఈ తంతుని ఎంత అసంబద్ధంగా ఆచరిస్తున్నామో చూడండి. ఎప్పుడయితే మనం చేసేది ఎంత పనికిమాలినదో అర్ధం చేసుకుంటే అప్పుడు ఏ విషయమైనా తార్కిక దృష్టితో ఆలోచించి మనం చేస్తున్న పని సరైనదా కాదా అన్న వివేకంతో చేస్తాము. దానివలన మనలో సరైన దృక్పథం అలవడుతుంది. మనలో దాగి ఉన్న తెలియని భయం పోతుంది.

అటువంటి ఇంకో మూఢవిశ్వాసం ప్రయాణానికి పోబోతుంటే భర్తను కోల్పోయిన విధవ ఎదురువచ్చినా ప్రయాణాన్ని వాయిదా వేసుకొని తిట్టుకుంటూ వెనుదిరిగి ఇంటికి వచ్చి, పోబోతున్న పని ఒత్తిడి తీవ్రతను బట్టి టెన్షన్ పడుతూ, విలువైన కాలాన్ని వృధా చేసుకొని మళ్లీ వీధిలో ఒకసారి చూసుకొని బయలుదేరుతాము. ఇంతకు ముందు మనం అనుకున్న ఎదుటివారు తుమ్మితే మనం ప్రయాణం వాయిదా వేసుకోవడానికి ఏదో తెలిసీ, తెలియని కారణం ఉంది. విధవ ఎదుటపడితే తిట్టుకుంటూ వెనుతిరిగే దాంట్లో అసలు కారణం లేదు సరికదా! భర్తను కోల్పోయి దుఃఖంలో ఉన్న స్త్రీని చూచి తిట్టుకుంటూ పోవడం, దాన్ని చూసి ఆ స్త్రీ మనస్సు కష్టపెట్టుకోవడం ఒక జీవిని



హింసించినట్లు అవుతుంది గదా! ఏ విధంగా చూచినా ఇది దారుణమైన మూఢవిశ్వాసం. అసలు దీనివెనుక ఏదన్నా కారణం ఉందా అని ఆలోచిస్తే ఎంతో ఆసక్తిదాయకం గానూ, ఆశ్చర్యకరంగానూ వున్న విషయం బయటపడుతుంది.

పూర్వపుకాలంలో పల్లెలే ఉండి పట్టణాలు లేని రోజులలో అందరూ ఒకే కుటుంబం అని భావించేవారు. అప్పుడు ఊరిలోని ఏ స్త్రీకైనా భర్త చనిపోతే గ్రామంలోని అందరూ దుఃఖించేవారు. తమ తోబుట్టువుకే అటువంటి కష్టం వస్తే ఎంత బాధపడతారో అట్లా బాధపడేవారు. అలా కష్టసుఖాలను అందరూ కలిసి పంచుకొని జీవిస్తున్న రోజులలో ఏదైనా కార్యార్థమై ప్రయాణం చేయడానికి బయలుదేరుతున్నపుడు భర్తను కోల్పోయిన విధవ ఎదురువస్తే ఆమెను చూడగానే ఆమె అనుభవిస్తున్న దు:ఖం గుర్తువచ్చి వాళ్లూ బాధపడి ఆ బాధతో ప్రయాణం చేయలేక వెనక్కి వచ్చి బాధ ఉపశమించిన తరువాత బయలుదేరేవారు. **ఎంతో అర్థవంతమై మానవతా దృక్పథంతో కూడిన ఈ ఆచారం ఈనాడు భ్రష్టుపడి ఎంత 'ఇన్‌హ్యూమన్' అయ్యిందో చూడండి.** సాటిమనిషి పడుతున్న బాధకు సానుభూతి చూపకపోగా, మన పనిచెడగొట్టడానికి ఎదురువచ్చింది అన్న దుగ్ధతో ఎదురుగానే తిట్టుకుంటూ పోవడం ఎంత అమానుషచర్యో అర్థం చేసుకోండి.

అలాగే దేశకాల పరిస్థితులకనుగుణంగా పెద్దలేర్పరచిన ఎన్నో ఆచార వ్యవహారాలు కాలక్రమంగా వికృతి రూపాన్ని పొంది మనలో ప్రకృతి సహజమైన మానవత్వాన్ని మంటగలిపి రాక్షస ప్రవృత్తిని కలిగిస్తున్నది. అటువంటి దురాచారాలను రూపుమాపి సదాచారాన్ని రక్షించడానికే మహాత్ములు అవతరించేదని గురువుగారు అంటారు. గురువుగారు తిరుమలలో వున్నపుడు ఉన్న మూడ్ చాలా ప్రత్యేకంగా వుంటుంది. ఎంతో ఉల్లాసంగా, ఆనందంగా ఉంటూ అందరినీ ఆనందింపచేస్తుంటారు. ఒకవైపు అంతర్ముఖులై కాసేపు కళ్లు మూసుకుంటూ, కళ్ళు తెరుచుకొనే అంతర్ముఖులు అవుతూ (తనలోనికి చూస్తున్నట్టుగా వుంటుంది) ఎంతో ప్రశాంతంగా కాసేపు, ఎంతో గంభీరంగా కాసేపు వుంటుంటారు. ఎవ్వరు ఏ ప్రశ్న అడిగినా దానికి వారినుండి వచ్చే సమాధానం ఎంతో డీటైల్‌గా వుంటుంది. అలాగే ఎవ్వరు ఏమి కోరినాసరే వాటిని ప్రసాదించే వారి స్థితిని చూస్తుంటే సాక్షాత్ శ్రీవేంకటేశ్వరస్వామే వారి స్థితిలో ట్యూన్ అయి మనలను అనుగ్రహిస్తున్నారా అనిపిస్తుంది. జగత్తులో ఉన్న సర్వజనులు వాళ్ల వాళ్ల కోరికలను తీర్చమని స్వామివారిని కోరి కోర్కెలు తీర్చుకొని ఆ కృతజ్ఞతతో శ్రీస్వామివారి దర్శనానికి వస్తుంటారు. **పరిపూర్ణసిద్ధత్వం, జ్ఞానం** ***(మిగతా 19వ పేజీలో)***



## అనుభవం

**శిష్యుడు :** గురువుగారూ! బాబా మాకు ఏదైనా అనుభవం ఇచ్చినప్పుడు దానిని ప్రక్కన వాళ్లకు చెప్పుకోవచ్చా?

**గురువుగారు :** చెప్పడంలో తప్పేమీలేదు. ఈ చెప్పడం వెనుక ఏమవుతుందనంటే, ఎదుటివాడిని బాబా భక్తుణ్ని చేయాలి, లేకపోతే బాబా యొక్క పేరును ప్రచారం చేయాలి అనేది దృష్టి కానపుడు మనకేం ఇబ్బందిరాదు.

ప్రక్కనవాడు కష్టంలో ఉన్నాడు, నీకు తెలిసినటువంటి పరిష్కారం అది. నీ పరిష్కారాన్ని వాడితో పంచుకున్నావు. తప్పేంటి?

నేనందుకే మీకందరికీ చెప్పేదేమిటంటే, సత్సంగం అంటే సాయి ప్రచారం కాదు. సాయి ప్రచారం అయితే చేయకండి. బాబాకు ప్రచారం అవసరంలేదు. సత్సంగం అంటే ఏమిటనంటే, మనకు బాబా పట్ల ఉండేటువంటి ప్రేమను, మనకు జరిగినటువంటి మేలును, ఆ ప్రేమ వల్ల మనకు జరిగినటువంటి మేలును సాటివాళ్లతో పంచుకోవడం. దానికి మించిన మానవసేవ ఇంకొకటి లేదు. ఇంతకు మించిన సేవ ఏమిటి?

మామూలు చిన్నచిన్న ఉదాహరణలు చూడండి. ఒక మంచి సినిమా చూసొచ్చారు. చూసి వచ్చి గమ్మునుంటారయ్యా మీరు! ప్రక్కవాడికి చెప్తారు. నువ్వు ఆ సినిమా తప్పకుండా చూడాల్సిందే, ఏమైనా సరే! చూడకపోతే నేను ఒప్పుకోను అంటారు. వాడు, నాకు కుదరదురా బాబూ అనంటే, లేదు నేను టికెట్ కొనిపిస్తాను, నేను ఇస్తాను టికెట్, నువ్వు పో అంటారు.

ఇక్కడ మనం కూర్చొని వున్నాము. మాట్లాడుతూ, అక్కడ ఆకాశంలో ఒక పెద్ద బ్లూలైట్‌లాగా మనకేదో ఒకటి కనిపించింది. అది ప్రకాష్ చూసాడు. చూసి గమ్మునుంటాడా..చూసి ఎంజాయ్ చేస్తూ, భలే ఉంది, భలే ఉంది అని అనుకొని ఎవ్వరికీ చెప్పకుండా గమ్మునుంటాడా? ఉండడు. వెంటనే, సార్! సార్! చూడండి చూడండి, ఎంత బ్యూటిఫుల్‌గా వుందో అంటాడు. ఒక అద్భుతం కనిపించింది. ఆ అద్భుతాన్ని పదిమందితో పంచుకోవాలి. ఈ పదిమందితో పంచుకున్నప్పుడు మన ఆనందం ఇంకా ఎక్కువ అవుతుంది. అందరినీ పిలిచి మరీ చూపిస్తాము.

నువ్వు పరీక్ష పాసయ్యావు. పార్టీ ఎందుకు ఇస్తావయ్యా? నువ్వు పరీక్ష పాస్ అయితే నీకు ఆనందం, మాకేమిటంట అంటా నేను. నీకు వచ్చిన ఆనందాన్ని పదిమందితో పంచుకుంటున్నావు. ఇదే సత్సంగం అంటే.



నువ్వు బాబా పట్ల, బాబా వల్ల ఒక ఆనందాన్ని పొందావు. నీ జీవితంలో కొన్ని మార్పులు జరిగాయి. అవి నీకొక ఫుల్‌ఫిల్‌మెంట్ ఇచ్చాయి. ఇది ప్రక్కన వాళ్లు కూడా ఎందుకు పొందకూడదు అని, వాళ్లకు కూడా నువ్వు దాన్ని కలుగజేస్తున్నావు, వాళ్ళకి చెప్తున్నావు నువ్వు ఆ పరిష్కారాన్ని. కష్టంలో ఉన్నాడు, అబ్బాయ్ నాకు ఈ కష్టం వచ్చినప్పుడు నేనిలా చేసాను. నువ్వు కూడా అలా చేసుకో అని చెప్తున్నావు. నేనొక అద్భుతమైనటువంటి ఆ బ్లూలైట్‌లాంటిదాన్ని, ఒక అద్భుతాన్ని కనుక్కున్నాను– అదే **'సాయిబాబా'** అంటే! చూడు, నువ్వు కూడా.

కాబట్టి సత్సంగం అంటే ఏమిటంటే, మన ఆనందాన్ని, మన భక్తిని, మనలో బాబా పట్ల ఉండే ప్రేమను, బాబా పట్ల మనకు వచ్చినటువంటి ఫుల్‌ఫిల్‌మెంట్‌ని దానిని సాటివారితో పంచుకొని, వాళ్లు కూడా ఈ ఆనందాన్ని పొందితే బాగుండును అనేటువంటి తపనకు ఒక ఎక్స్‌ప్రెషన్ మాత్రమే అది. అంతకుమించి ఇది బాబా ప్రచారం కాదు. బాబా భక్తుల లిస్టుని పెంచడమూ కాదు. ఓటర్స్ లిస్ట్‌ని పెంచడం కాదు. బాబాకు ఇవేం అవసరం లేదు. ఎందుకంటే నువ్వు పెంచలేవు. అది సాధ్యంకాదు మనకు. ఎందుకంటే **'నా భక్తుడ్ని నేనే ఎన్నుకుంటాను'** అన్నారాయన. ఆయన ఆ మాట అన్న తరువాత ఎవరైనా బాబా ప్రచారం అంటే, అంతకంటే అర్థంలేని వ్యవహారం ఇంకొకటి లేదు. ఆయన ఎన్నుకుంటానంటే మనం ఎలక్షన్స్ కండక్ట్ చెయ్యడం లాంటిది అది. **–శ్రీబాబూజీ**

---

***(17వ పేజీ తరువాయి)*** **కలిసిన యోగస్వరూపం కనుకనే శ్రీవేంకటేశ్వరస్వామి వారి సన్నిధికి ఇంత భక్తసందోహం రావడం.**

ప్రశాంతంగా వున్న సమయంలో గురువుగారు అన్నారు. "ఎప్పుడో సమాధి అయిన సద్గురు ప్రెజెన్స్ ఇప్పటికీ ఎంతో కొట్టొచ్చినట్లుగా ఎంత హాయిగా వుందో గదా! ఇన్ని లక్షలమంది ఇక్కడికి వస్తున్నా ఎవ్వరూ స్వామివారి సన్నిధిని ఆస్వాదించడంలేదే అని వాపోయారు. స్థిమితంగా వచ్చి ఇక్కడ వుండగలిగి స్వామి ప్రెజెన్స్‌ని అనుభవించగలిగితే చాలా బాగుండునని" అంటుంటారు.

స్వామి సన్నిధి ప్రభావం తమరికి ఎలా వుంటూండేది అని గురువుగారిని అడిగితే వారు ఇచ్చిన సమాధానం ఏంటంటే, "ఆరుబయట హాయిగా పడుకొన్నట్టు ఉంటుంది. ఆ స్థితి అనుభవించాలంటే మేము ఏమిచేయాలి అని అడిగితే "మనకు వేడి కావాలంటే నిప్పువద్ద వున్నట్లే, స్వామి సన్నిధిలో వుండడమే. అప్పుడే మనం వారి ప్రెజెన్స్ అనుభవించగలము" అన్నారు. అది కేవలం తిరుమల



విషయమేగాదు ఏ మహనీయుని సన్నిధి అయినా సరే ఈ సూత్రం అప్లై అవుతుందనిపిస్తుంది. "శిరిడీలో సాయినాథుని సన్నిధిలో వుంటే చాలు. మనము చేయవలసింది ఏమీలేదు" అని అంటుంటారు. దీనినిబట్టి **"మనం వారి సన్నిధిలో వున్నామన్న ఎఱుకను నిరంతరం గుర్తుంచుకొని వుండడమే" అత్యుత్తమ సాధన** అనిపిస్తుంది.

ఆధ్యాత్మిక చరిత్రలో భగవాన్ బుద్ధుడు రాజైవుండి సర్వసౌభాగ్యాలను త్యజించి మానవాళి దుఃఖానికి స్పందించి, దాని నివారణోపాయాన్ని కనుగొని మానవజాతిని పట్టి పీడిస్తున్న దుఃఖాన్ని తొలగించాలనే తపనతో ఎంతో తీవ్రతపస్సు చేసి, చివరకు దుఃఖరాహిత్య స్థితి అయిన బుద్ధత్వాన్ని పొందారని మనం చదువుకున్నాం. మహాత్ములందరూ తీవ్రసాధన చేసి, సాధనలో వున్న ఒడిదుడుకులను అనుభవించి మనకు ఎంతో సౌలభ్యంతో కూడిన సాధనలను అనుగ్రహిస్తారు. అదే కోవకు చెందిన మన గురువుగారు సాధనాకాలంలో శరీరాన్ని, మనస్సును ఎంతో శ్రమపెట్టి మామూలుగా ఎన్నిరకాల సాధనలు మహాత్ములు చేసి మనకు బోధించారో అన్ని సాధనలను చేసి కఠినమైన నిబంధనలతో ఎవ్వరూ సాధించనంత తక్కువకాలంలో వారు అనుకొన్న లక్ష్యాన్ని చేరుకోగలిగారు. అంత కష్టపడి సంపాదించిన జ్ఞానసంపదను అడిగినవాళ్లకు అడిగినట్లు ఇవ్వడానికి సిద్ధంగా వున్నారు.

గురువుగారి వద్దకు వచ్చినవారికి ఎవ్వరికీ ఏవిధమైన దీక్షలుకాని, సాధనలుగాని విధించరు. "కోరికలతో వచ్చినవారి అర్హత కేవలం కోరిక తీర్చుకోవాలని వుండడమే. అలాగే కోరిక తీర్చుకోవాలన్న కోరిక ఎంత బలంగా మనలో వుంటే అంత ఆర్తిగా సద్గురువు ముందు సాష్టాంగపడి అర్థించగలము" అంటారు గురువుగారు. కోరికలతో వచ్చినవాళ్ళకు వేదాంతబోధ చేయడమననేది గురువుగారికి నచ్చని విషయం. ఎవ్వరు కోరికలతో వచ్చినా దాన్ని తీర్చడమే సాయిబాబా చేసింది. అలాగే నా వద్దకు ఋణానుబంధంగా వచ్చిన వాళ్ళకు వాళ్ళ కోరికలు తీర్చమని బాబాను ప్రార్థించడమే నేను చేస్తున్న పని, వచ్చినవాళ్ళు ప్రాపంచిక కోరికలతో వచ్చినాసరే, ఆధ్యాత్మిక జిజ్ఞాసతో వచ్చినాసరే వాళ్ళకు కావలసింది వాళ్ళకు చేసి ఋణవిముక్తుణ్ణి కావడమే సాయిబాబా నాకు విధించిన సాధన" అంటారు గురువుగారు. (అల్లా నాకు కొన్ని పైసలప్పగించారు –శ్రీసాయిబాబా). గురువుగారి వద్దకు వచ్చి వాళ్ళ కోరికలు తీరినవాళ్ళు "మీరే గదా మా కోరికలు తీర్చింది" అంటే **"అందరి కోరికలు తీర్చేది సాయిబాబా. నేను నా ఉద్ధరణలో భాగంగా సాయిబాబా విధించిన కార్యంగా మీ సమస్యలను పంచుకుంటున్నాను తప్ప నాలో ఏమీలేదు. అంతా సాయినాథుని అనుగ్రహమే"** అంటారు శ్రీబాబూజీ.

(అల్లా అచ్ఛాకరేగా అనేవారు శ్రీసాయిబాబా)

*– డా॥ శ్రీనివాసులరెడ్డి*

# గురుకృపాలహరి



"జీవితమంతా ఒక పరిశోధనాలయములో చేసిన కృషి కంటే, యావజ్జీవితం ఒక గ్రంధాలయంలో చేసిన పఠనం కంటే ఒక్క యోగివర్యుని అనుభవం ఎక్కువ ఫలితం ఇస్తుంది" అంటారు నానీ పాల్కీవాలా! "యోగిపుంగవులు మానవులను ఉద్ధరించే మహనీయమూర్తులు. మహత్తరమైన వారి శక్తులు భౌతికవాదులకు మింగుడుపడవు. సామాన్యుల బాహ్యదృష్టికి కనిపించని అనేక లోకాలను గోచరింప చేసి ఈశ్వరసాక్షాత్కారానికి అవి దారి చూపుతాయి" అంటారు స్వామి వివేకానంద. నిజానికి సద్గురుమూర్తులు అవతరించేది మనలో నిద్రాణంగా ఉండిపోయిన దైవత్వాన్ని మేల్కొలిపేందుకే! లేకపోతే, సర్వత్రా ఆవరించిన దైవాన్ని దర్శించగల్గిన వారికి వేషభాషలతోనూ, వ్యవహారముతోనూ పని ఏముంది? "సముద్ధరణార్థం కలౌసంభవంతం" – మనిషి ఉద్దరణే మతంగా ప్రభవించిన జగద్గురు 'చంద్రు'లు – సాయినాధులు, చంద్రశేఖరులు, శరశ్చంద్రులు... సత్య సందర్శనాభిలాషులైన ఆప్తులకు, 'మార్గమేది' అన్న జిజ్ఞాసువులకు, సద్గురువు పరుసవేదిగా దర్శనమిస్తాడు. చేయి పట్టి నడిపించి చివరికంటా గమ్యం చేరుస్తాడు. అంతరాలు సృష్టించుకుంటూ, మానవత్వపు అంతానికి నడుం బిగించిన మనలను మానవజాతిగా, ఆపై మాధవజాతిగా మార్చడానికి మరలి వచ్చిన మహనీయుడు గురువు. "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణఃపరః" అంటూ... బాహ్య అంతరములలో మరియు "సహస్రశీర్షా! సహస్రాక్ష సహస్రపాత్" అంటూ... తమ చెంతకు చేరే ప్రతి జీవిని భగవత్ ప్రసాదంగా, భగవత్స్వరూపంగా దర్శించి, సేవించి, మార్గనిర్దేశనం చేసే మహితమూర్తులు సద్గురువులు. **తెరచిన కన్నులకు గురువు పరచిన వెన్నెల**. సాగరునిపై, స్థాణువుపై, తరులపై, గిరులపై, మానుపై, మనిషిపై, అందరిపైనా అదే **వెన్నెల – చల్లని సమీరంలా! అప్పుడు పద్మం వికసిస్తుంది – చంచలచిత్తం నిద్రిస్తుంది.** వెన్నెలది మాత్రం ఒక్కటే మతం– జగమంతా చీకట్లు తొలగించే అభిమతం. గురుచంద్రుని అనుగ్రహ వెన్నెల కూడా అంతే కదా! **అహం వాకిళ్ళను చిమ్మి, చిమ్మ చీకట్లను తరిమి మానవుని అగచాట్లను బాపే చల్లని వెన్నెల. అందుకే మా గురుదేవులంటారు – "ఒక్కటే మహామంత్రంగా పెట్టుకోండయ్యా–అహము వదిలేయుటే సాయిపథం" అని ఆ అడ్డుగోడ తొలగిస్తే రెండు లేవు – ఒక్కటే రూపం – ఆనందస్వరూపం.** అందుకు సాక్షీభూతులే, అనుగ్రహప్రదాతలే – చంద్రశేఖర యతీంద్రులు, శ్రీసాయినాధులు, శ్రీశరశ్చంద్రులు.



అవతార వరిష్ఠులకే సరిపోతుందేమో 'చంద్రుడనే' విశేషణం – ఎంచేతనంటే భాస్కరుని (సూర్యుని) తేజస్సును క్షణాలకు మించి తాళలేని సామాన్యులము కదా! త్రేతాయుగరాముని కూడా శ్రీరామ'**చంద్రుని**'గా కీర్తించిన భరతవర్షమున జన్మించిన ధన్యులము కదా! శ్రీరామ'**చంద్రుని**'కి సర్వాహ్లాదన శక్తి ఉండేదని వాల్మీకి మహర్షి తమ రామాయణ కథామృతంలో హృద్యంగా వర్ణిస్తాడు. పట్టాభిషేకానంతరం వానరసేనను సంభావించినపుడు వానరోత్తములంతా "ప్రభువు నన్ను చూసి నవ్వాడని, నావైపే చేతులు చాచాడనీ, నన్నే పలకరించాడనీ, నన్ను మెచ్చుకున్నాడనీ" అనుకునేవారట. ఏమిటీ విశేషం. ఒక్కడే రాముడు– సర్వజనానంద స్వరూపుడు. అందుకే అన్నారు – శ్రీరామ'**చంద్రు**'డని.

జగద్గురు'**చంద్రులు'** పరమాచార్యుల విభవము కూడా అట్టిదే! ఎన్నో వేలమంది జనబాహుళ్యం – ఊపిరి సలపని భగవత్ సేవా కైంకర్యం! కానీ ప్రతీజీవికి ఏదో ఒక (తెలియని) మాటలకందని బాంధవ్యం. ఎవ్వరిని అడిగినా వారితో ఎంతగానో పెనవేసుకుపోయిన అనుబంధం–అభివ్యక్తం. ఎన్నో జీవుల వెతలు తీరిన వైనాలు, వారు చూపించిన జ్ఞాననిర్దేశనాలు, ఆచరించి చూపిన మార్గాలు... ఇలా ఎన్నో! ఎలా సాధ్యం ఈ సర్వాహ్లాదనం, సర్వజీవ సమతమమతల సన్నిధానం! పెద్దలంటారు – "ప్రజ్ఞా బ్రహ్మ పదజ్ఞ యస్యరసజ్ఞాతా తాత్త్వికర్థజ్ఞ చిత్తం దేవ్యాయత్తం, వందే తం చంద్రశేఖరేంద్ర యతిం" అని. 'జ్ఞ' అంటే తెలుసుకొనుట అని అర్థం. 'ప్రజ్ఞ' అంటే బుద్ధి. వారి బుద్ధి (మతి) దేన్ని తెలుసుకుందిట అంటే బ్రహ్మపదాన్ని తెలుసుకుందిట. బ్రహ్మము అంటే మనకి తెలిసిన 'బ్రహ్మ' అని కాదు అర్థం. ఎవ్వరైతే ఈ సృష్టిని చేసి, ఎవ్వరైతే ఈ సృష్టిని నడిపి, ఎవ్వరైతే ఈ సృష్టిని అవసరమైతే తనలో కలుపుకుంటున్నాడో, ఆ మూడుమూర్తులకు ఒక్కటే స్వరూపమిస్తే అది 'బ్రహ్మ'మయింది. అటువంటి బ్రహ్మచరణాలను చేరిందట వారి తలంపు. వారు తమ వాక్కురూపంగా ఒక్క అక్షరం మాట్లాడినా అది భగవత్‌తత్త్వాన్ని ప్రతిబింబించింది–మనకు కర్తవ్యాన్ని బోధించింది. పరమాచార్యుల చిత్తం వారు విశ్వసించిన కామాక్షికి ఆయత్తమయిపోయింది.

తానొకటి – జగత్తు ఒకటి కాదు. తనలో జగత్తు – జగత్తులో తను. అందుకే అంటారు. "యోగి సత్యం చెప్పాడు" అన్న మాట సరైనది కాదు. "యోగి చెప్పింది సత్యమవుతుంది" అన్నది సరైనమాట అని. ఇలా సర్వోన్నత ప్రకృతితో తాదాత్మ్యత చెందిన మహితాత్ములు సమస్త జీవజాలమును సమభావంతో (నే) చూడగలగడం వల్ల ప్రతీ జీవి ఆహ్లాదభరితమవడం సహజమే కదా!



నాబోటి అల్పులకు సద్గురుదేవులు శరశ్చంద్రుల సర్వాహ్లాదశోభ అవగతమయ్యేది కాదు. పండితులు, పామరులు, దేశవిదేశీయులు, సర్వ మతానుయాయులు వేలాదిగా వారి చరణాలనాశ్రయించెడివారు. ఎవరిని చూసినా వారి దర్శనానంతరం ఏదో ఒక అవ్యక్తానుభూతి, ఆనందాతిశయం - మౌనం, సంతోషం ఇలా ఎన్నో భావాలు - ఆరోజు అర్థమయ్యేది కాదు వారి విరాట్‌స్వరూపము. దేవా! మిమ్ములను దర్శించే భాగ్యమునొసగిన సాయి సమర్థుల చరణారవిందములను కైమోడ్చి నమస్సులర్పిస్తున్నాము. సదా మా గురుదేవుల నోట సాయితత్త్వమే పల్లవించి, మాకు దారి చూపింది. తమ చిత్తాన్ని సాయికి ఆయత్తం చేసిన మహితాత్ములు మా గురుదేవులు. అంచేతనే ఎప్పుడూ వారినోట ఏ మాట వెలువడినా అది జరిగి తీరేది శ్రీసాయి సాక్షిగా. సదా వారు సాయితో, సాయిలో లయించి ఉండేవారు. మాట్లాడితే సాయి ఊసే! తలిస్తే సాయి ధ్యాసే! మాటలు వారికి ప్రతిబంధకమయినా మాబోంట్లను ఉద్ధరించ అనుగ్రహభాషణాన్ని సలిపేవారు. వారి మాటలు జ్ఞానరత్నాలు. మౌనమే వారి పరిభాష. జగద్గురువుల మార్గమే ఇది కదా! పరమాచార్యుల - పూజ్యగురుదేవుల లీలా విశేషాలన్నీ వారి తత్త్వ దర్శనాలే!

పరమాచార్యుల ప్రథమ విజయయాత్ర ప్రారంభమయిన మొట్టమొదటి (1919వ సం॥) (వ్యాస) గురుపూర్ణిమ వేపత్తూర్‌లో జరిగింది. వేద సాంప్రదాయంలో వేదాలను నాలుగు విభాగాలుగా విభజించిన 'వేద'వ్యాసుని స్మరించి, పూజించే సాంప్రదాయంగా ప్రారంభమయి గురుపూజ వైభవంగా రూపుదాల్చింది. ఆనాడు శుభాన్ని సూచించే అక్షతలు (పసుపుబియ్యం)ను పూజామందిరంలో పరచి మధ్యన కృష్ణభగవానుని ప్రతిమనుంచి ఋషులకు, సద్గురుపరంపరకు ప్రతిరూపంగా నిమ్మకాయలను చుట్టూ ఉంచి పూజిస్తారు. తరువాతి కాలంలో సన్యాసాశ్రమ ధర్మంలో ఇది ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. దేశంలోని ప్రధాన దేవాలయాలన్నీ పరమాచార్యులకు ప్రసాదాలను పంపేవి. రాజులు, భూసురులు అందరూ స్వామివారికి (పీఠానికి) కానుకలను సమర్పించుకునేవారు. వేలాదిగా ఉన్న శిష్యులు, భక్తులందరూ స్వామి చెంతన చేరి ఈ పూజా కార్యక్రమాన్ని దర్శించి తరించేవారు. 1920వ సం॥ స్వామివారు తిరువారూర్‌కు విజయం చేసారు. అక్కడి ప్రజలు స్వామివారికి బ్రహ్మరథం పట్టారు. పరమాచార్యులు అక్కడ ఉన్నన్ని రోజులు ప్రతీరోజు త్యాగరాజస్వామి అధిష్టానమును తప్పక దర్శించుకునేవారు. 1920 వ సం॥ గురుపూర్ణిమ మయూరమ్‌లో జరిగింది. మూడు నెలల కాలం తమ సన్నిధానాన్ని అనుగ్రహించారు స్వామి. మూడువందల మంది బ్రహ్మచారులకు నిత్య



వేదాధ్యయన తరగతులను నిర్వహించారు పరమాచార్యులు. మయూరమ్‌లో నివసించిన కాలంలో ఇస్లాం సంప్రదాయంలో వరిష్ఠుడై, పుట్టుకతో అంధుడైనా, ఖురాన్‌ను చక్కగా అవగతం చేసుకున్న ఒక తత్త్వజ్ఞుడు స్వామివారిని చేరాడు.

ఆనాడు స్వామివారు పూర్తిగా పూజాదికాలలో నిమగ్నమయి ఉన్నారు. సమయాభావంలో కూడా వారిని సాయంత్రం 4గం॥లకు కలుస్తానని మాట ఇచ్చారు. పండిత సభను ముగించి తమ చెంతకు ఆ ముస్లిం తత్త్వజ్ఞుని ఆసీనులను చేసుకున్నారు స్వామి. కుశల ప్రశ్నల తర్వాత ఇస్లాం సాంప్రదాయాలను గురించి, వారి ఆచారాలను గురించి, తత్త్వం గురించి అడిగారు. చివరకు అతను అన్న మాటలు, "ఉన్నత యోగిపుంగవులైన మీ ముందు నేను ఏమని మాట్లాడగలను. అన్ని మార్గాలు భగవంతునికి దారి చూపేవే! మీలో నేను ఆ దైవత్వాన్ని 'చూడ'గలుగుతున్నాను- నా హృదయం నిండా మీ దైవత్వాన్ని అనుభవించగలుగుతున్నాను. 'ప్రేమ'ను దర్శించగలిగిన చోట 'దైవాన్ని' కూడా దర్శించగలం కదా" అన్నారు. పరమాచార్యుల చుట్టూ ఉన్న భక్తులంతా అతని మాటలు విని ఆశ్చర్యానందాలకు లోనయ్యారు.

1920వ సం॥ నవరాత్రి ఉత్సవాలు సిర్కాజిలో జరిగాయి. స్వామివారి అనుగ్రహ సన్నిధిలో ప్రజలు తరించారు. అక్కడి స్కూల్‌కు స్వామివారు వెళ్లడం. అక్కడి విద్యార్థులను స్వామివారు దీవించి, విద్యను బోధిస్తున్న కుటుంబాలను స్వామివారు ఆశీర్వదించడం ఒక మరపురాని అనుభూతి. అదే కాలంలో వారు శ్రీపరాశివేంద్ర సరస్వతీ స్వామివారి (కంచి మఠ పూర్వ పీఠాధిపతి) అధిష్ఠానమును, సదాశివబ్రహ్మేంద్ర స్వామివారి అధిష్ఠానమును కూడా దర్శించుకున్నారు. 1921వ సం॥ సకల తీర్థసంగమంగా, పరమ పవిత్రంగా భావించే మహామహము కోనేటి వద్ద స్వామి పుణ్యస్నానాలు ఆచరించారు. శంకరమఠ ప్రాంగణము దగ్గరలోనే ఉన్నప్పటికి 1919 వ సం॥లోనే స్వామివారు కాశీయాత్రను ప్రారంభించడంతో మఠం ప్రాంగణానికి స్వామివారు వెళ్లలేదు. ధర్మస్వరూపులు కదా స్వామి! ఒక లక్ష్యంతో సాగిపోయే వ్యక్తికి, గురువు చెప్పిన మాటను బాటగా మలచుకున్న వ్యక్తి ఎన్నడూ తన స్వాభిమానానికి తావివ్వడు కదా! మహామహములో స్వామివారి మజిలీ సమయంలో 200 మంది యువ ముస్లిం వాలంటీర్లు " చెన్నై యువ ముస్లిం" ఆధ్వర్యంలో ప్రజాసేవను చేసారు. యువకులంతా 20-25 సంవత్సరాల మధ్యవారే! సేవ చేసిన ఆ ముస్లిం యువకులనందరినీ మఠం విడిదికి పిలిచి భోజనం అందించి - ప్రతీ ఒక్కరితోనూ విడివిడిగా మాట్లాడి వారి విద్యను



గురించి, వారి కుటుంబాలను గురించి కుశల ప్రశ్నలనడిగి అందరినీ ఆశీర్వదించారు స్వామి. వారందరి విశేషసేవకు సత్కారంగా వారికి స్వామి ఒక వెండి కప్పును అనుగ్రహించారు. మరో వాలంటీర్ల గ్రూపును అలాగే ఆశీర్వదించారు స్వామి. స్వామివారి సమత్వ దృష్టికి అద్భుతమైన లీలా విశేషం ఈ సంఘటన. కంచి మఠ ప్రాంగణానికి ప్రక్కనే ఒక మసీదు ఉంది. మసీదు ఉన్నప్పుడు ప్రార్ధనా సమయాల్లో నమాజు ధ్వనించడం సహజమే కదా! ఇలాంటి సమయంలో ఒక రోజున ఒక అంతేవాసి స్వామిని సమీపించి ఇలా అన్నాడు. "స్వామి! కొన్ని సమయాల్లో మఠ కార్యక్రమాలకు మసీదు వల్ల అంతరాయం కలుగుతోంది. వారికి సానుకూలంగా ఉన్న ప్రాంతానికి మసీదును తరలించమని అభ్యర్ధించమంటారా?" స్వామివారు తమ మౌనాన్ని వీడి ఒక్కటే మాట అన్నారు. **"మసీదు కూడా దేవాలయమే కదా!"** అంతే! ఇక మరో మాట రాలేదు ఆ అంతేవాసికి. ఎప్పుడో జరిగిన సంఘటన ఇది. స్వామి వారి బృందావనం (సమాధిస్థానం) దర్శించినపుడు ఎవరైనా గమనిస్తే ప్రక్కనే ఉన్న మసీదును చూసి–స్వామివారి సమత్వదృష్టికి నమస్సులర్పిస్తారు. మహామహములోని ఈ వేడుకలో స్వాతంత్ర్య సమరయోధుడు సుబ్రహ్మణ్యశివమ్ కూడా పాల్గొన్నారు. వేలాదిగా ఉన్న జనంలో అతనిని గుర్తించిన స్వామి – అంతేవాసులను పిలిచి వారిని తమవద్దకు తోడ్కొనిరమ్మని–శివమ్‌ను ఆశీర్వదించారు. స్వామివారి ఈ విశేష ప్రేమకు శివమ్ ముగ్ధుడయ్యాడు. భారతావనికి త్వరగా స్వాతంత్ర్యం లభించాలని, ప్రజలలో దైవభక్తి, పాపభీతి పాదుకోవాలని ఆశీర్వదించమని వేడుకున్నాడు శివమ్.

స్వామివారు 1918వ సం॥ నుంచే చేనేత, ఖద్దరు ధరించడం మొదలుపెట్టారు. ఆడంబరంగా ఉండే సిల్కుదుస్తుల (వస్త్రము) స్థానే ఖద్దరు ధరించడం ఎంతో సంతృప్తిగా ఉండేది స్వామివారికి. రెండువందల జతల ఖద్దరు వస్త్రాలను తెప్పించి మఠ అంతేవాసులందరికి ఇచ్చి అందరినీ ఖద్దరు ధరించమని అభ్యర్ధించారు స్వామి. ఎందరో అంతేవాసులు ఆనాటినుంచి తమ జీవితాంతం ఖద్దరు మాత్రమే ధరిస్తామని ప్రతిన బూనారు. 1921వ సం॥ చాతుర్మాస్యం తర్వాత మన్నార్‌గుడి చుట్టుప్రక్కల ఉన్న మూడుజిల్లాల్లోని కావేరీ తీరంలో ఉన్న శైవ, వైష్ణవ దేవాలయాలన్నిటిని ఏ చిన్న గుడిని కూడా వదలకుండా అన్నింటిని దర్శించి జనులను తరింపచేసారు పరమాచార్యులు.

తంజావూరు జిల్లా సెల్లూరు దగ్గర గ్రామంలో స్వామి వారికోసం రెండువందలమంది హరిజనులు (క్రితం రోజుల్లోని సమాజ అట్టడుగు వర్గాలు) తమ కుటుంబాలతో సహా శుభ్రంగా స్నానం చేసి,



నుదుట విభూతి ధరించి స్త్రీలు, చిన్నారులు, పురుషులు అందరూ స్వామివారి దర్శనానికై వేచి చూస్తున్నారు. పరమాచార్యులు పల్లకీ దిగి వాళ్ళందరినీ ఎంతో ప్రేమగా పలకరించి, వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. భూస్వాములు వారిని చక్కగా చూసుకుంటున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. వారిని కూడా వారి నిత్య దైవారాధన ఎలా ఉంటుందో, ఎలా మార్చుకోవచ్చో, సులభంగా దైవస్మరణ ఎలా చేసుకోవాలో తెలియచేసారు. మఠ అంతేవాసులకు ఆ కుటుంబాలకు నూతన వస్త్రాలను అందించమని ఆదేశించారు. ఎంతో సమయం స్వామి తమ కోసం ఉండిపోవడం వల్ల జరిగిన ఆలస్యాన్ని క్షమించమని వేడుకున్నారు వారు. స్వామి అనుగ్రహాశీస్సుల ఆనందం వారిని పరవశుల్ని చేసింది. అణగారిన వర్గాల అభ్యున్నతికై స్వామివారి తపన ఎల్లలెరుగనిది. దైవానుగ్రహంగా సంపద పొందినవారిని – పేదలకు, అవసరార్థులకు అండగా నిలబడమని వినతి చేయడంలో (అభ్యర్థించడంలో) అవసరమైతే శాసించడంలో స్వామి శైలి విశేషంగా ఉండేది.

మా గురుదేవులు కళ్ళముందు కదలాడుతున్నారు. అంతరాలు తగ్గిపోయినాయి. కానీ మనిషి కోర్కెలే అంతులేకుండా పోయాయి. వారు కరుణాలయం కదా! అంతులేనంతమంది వారి చరణాలనాశ్రయించేవారు. ఎన్నో గంటలు, ఒక్కొక్కసారి పూటలు కదలకుండా సాయిభక్తుల మొరలన్నీ – క్షమించాలి ఆశ్రయించిన ప్రతీ ఒక్కరి ఆవేదనలను, నివేదనలను ఎంతో ఓపిగ్గా వినేవారు. ఆశీర్వదించేవారు. శ్రీసాయి చెప్పిన శ్రద్ధ – సహనములకు నిలువెత్తు నిదర్శనం మా పూజ్యపాదులు. జీవిత అట్టడుగు స్థాయికి చేరిపోయిన ఎందరి జీవితాలనో నిలబెట్టి సమాజంలో ఒక స్థితిని కల్పించిన మానవీయ మహోన్నతులు వారు. వారి చరణ కమలాలను ఆశ్రయించి ప్రాణాలను నిలుపుకున్న వారెందరో! వారి 'పదా'లను ఆశ్రయించి సాధనా ప్రస్థానంలో సమధికులై సాగిపోతున్న వారెందరో! వారు విదేహముక్తులైన తర్వాత కూడా వారి సన్నిధానాన్ని ఆశ్రయించి రుగ్మతలను బాపుకున్నవారెందరో! జీవిత ప్ర'స్థానం'లో భారాలను మోయలేక తనువు చాలించాలనుకుని వారి చరణాల ఉపాధి లభించి ఉన్నత 'స్థానాల'లో ఉన్న వారెందరో! ఉన్నత విద్యలు చదివి నిరుద్యోగులై నిరాశకు లోనై వారిని ఆశ్రయించి ఈనాడు విదేశాలలో స్థిరపడ్డ వారెందరో! **వారి కరుణార్ణవ పలకరింతల పలవరింతలలో పరవశులై నేటికీ ప్రేమను పంచేవారెందరో! ఇతరములేల! నావంటి అధమునిచే కలం పట్టించి 'నడిచేదైవం' గూర్చి తలపోయడం కంటే ఆధారభూతమేమున్నది మద్గురుదేవుల కరుణకు! మా**



**అందరి జీవితాలలో అవ్యాజంగా వారు 'నడిచివచ్చిన దైవం'** – మమ్ములనందరినీ 'నడిపించ వచ్చిన దైవం'. మా జీవితాలను అందంగా సృష్టించిన 'బ్రహ్మ' తాను – 'గురుర్బ్రహ్మ'. మా అందరి జీవితాలను ఆనందంగా నడిపించే 'విష్ణువు' తాను – 'గురుర్విష్ణు:' మా అందరి జీవితాలను సాయిపదాలకు చేర్చే లయకారుడు 'ఈశ్వరుడు' తాను – "గురుర్దేవో మహేశ్వరః" – దైవమైన సద్గురుదేవులు మనందరి జీవితాలను ఆనందసంద్రంలో ఓలలాడించుగాక! శుభం భవతు! సద్గురు చరణామృత ప్రాప్తిరస్తు! **– గురుకృప**

---

## ఆనందం

5 సం॥ల ప్రాయంలో ఓ సీతాకోకచిలుకను పట్టుకొన్నపుడు పట్టుకొని పరిగెత్తినప్పటి ఆనందం... ఆ సీతాకోకచిలుక రంగు మన చేతివేళ్ళకు అంటుకున్నప్పుడు ఎంత ఆశ్చర్యం.. ఆనందం... కలిగాయి. అప్పుడు మీ పొగుగెంత? మీ వయస్సెంత? ఇప్పుడు మీ పొడుగెంత? మీ వయస్సెంత? మీ సంతోషం కనీసం ఆ నిష్పత్తిలోనన్నా పెరిగి ఉందా? కల్లాకపటం లేని ఆ చిన్న వయస్సులో 'ఆనందం' తప్ప మరేదీ ఎరుగము. అందుకే చిన్నపిల్లల్ని దైవస్వరూపాలుగా చూసేది, చెప్పేది. ఆ ఆనందానుభవ నేపథ్యంలోని వారి స్వభావమే. వారి కల్లాకపటం లేని గుణమే వాళ్ళని దైవస్వరూపాలుగా చూసేది అని తెలియాలి.

తరువాత మనం పెరిగాము, సంతోషంగా ఉండటానికి ఎన్నింటినో సేకరించడం మొదలుపెట్టాం. పెద్ద చదువులు, కంప్యూటర్స్, డెస్క్‌టాప్స్, ల్యాప్‌టాప్స్, ఐపాడ్స్, స్వంతిల్లు, కార్లు, క్రెడిట్‌కార్డులు, టి.వి.... సైజులు పెరుగుతున్నాయి, మందం తగ్గుతుంది. ఎ.సి., ఫ్రిజ్, మొబైల్ ఫోన్, స్మార్ట్ ఫోన్ (కానీ మనం స్మార్ట్ అవలేకపోయాం, స్మార్ట్‌గా ఉండటం కోసం మేకప్పులు) అలా మన స్థాయికి మించి ఎన్నింటినో సమకూర్చుకుంటున్నాము. జీవితంలో సంతోషం కోసం ఇన్ని సమకూర్చుకున్నా మనం ఆనందాన్ని పోగొట్టుకున్నాం. ఏమైపోయింది ఆ చిన్నతనంలోని ఆనందమంతా? ఆ చిరుప్రాయంలోని ఆశ్చర్యమంతా? ఆలోచిద్దాం.. తెలుసుకుందాం... ఆచరిద్దాం.. ఆస్వాదిద్దాం.. అనుభవిద్దాం... ఆ అనుభవాన్ని అంటిపెట్టుకొని ఇంకా ఆనందిద్దాం ఈ జీవితాన్ని.

"ఈ జీవితం మనకొక వరం. సద్గురు కృపా స్వరూపం– వారి బిడ్డలు, శిష్యులు. ఇది మరువొద్దు. 'ఆయన వరం' అన్న ఎరుకే మనకి ఆనందాన్నిస్తుంది" అంటారు శ్రీబాబూజీ. ***(సేకరణ : గురుకృప)***



# ఆనందం

**గురువుగారు:** ఆనందంపై లగ్నం చేయి. అది చాలు. నీకున్న అవసరం మీద, దానిని (ఆ కొరతగా వున్నదానిని) పొందే మార్గం మీద లగ్నం చేయి. పరిష్కారాన్ని గురించిన ఆ ఆలోచనే నీకానందాన్నిస్తుంది. అదే బాబా దాసగణు మహరాజ్‌ను కాకాసాహెబ్ దీక్షిత్ ఇంటికి పంపించినప్పుడు ఈశావాస్యోపనిషత్తు ద్వారా ఆయనకు బోధపరచినది. అది చక్కని బోధ.

**గురువుగారు:** బాబా సంతోషము, పరమానందము యొక్క నిజతత్వాన్ని తనదైన చక్కని శైలిలో వివరించారు. కాకాసాహెబ్ దీక్షిత్ పనిపిల్లకొక క్రొత్తచీర ఇచ్చారు ఆమె ఆ చీరను ధరించకుండా ఒక పెట్టెలో భద్రపరిచింది. కానీ ఆనందంతో గంతులు వేస్తున్నది. తన క్రొత్తచీర పెట్టెలో వున్నదన్న ఆ ఎరుకే ఆమెకు అంతటి ఆనందాన్ని కలిగించి ఆ ఆనందంతో నాట్యమాడేలా చేసింది. ఎందుకని? అది అర్ధరహితం కదా! ఆమె ఇంకా ఆ చీరను ధరించలేదు.

కానీ ఆమె చీర ధరిస్తే ఏమౌతుంది? చీర కట్టుకున్నంత మాత్రం చేత ఆమెకు ఎక్కువ ఆనందం వస్తుందా? లేదు. ఆమెకు ఆ ఆనందం అంతకు ముందే, "చీర నాది. అది నా పెట్టెలో వున్నది" అన్న విషయం తెలిసినప్పటి నుంచీ వున్నది. ఆమెకు ఆనందమివ్వడానికి ఆ ఆలోచన చాలు. అందుకే ఆమె చాలా ఆనందంతో గంతులు వేస్తున్నది. దానినే ప్రేమ అంటారు. దానినే సాన్నిధ్యమంటారు. అదే గొప్పదైన ఈశావాస్యోపనిషత్తు చెప్పింది కూడా. చాలామందికి అర్ధంకాని విషయమదే. ఆమెకు ఒక చీర ఇచ్చారు. అది ప్రక్కనే వున్న గదిలో వున్నది. కానీ మనకది అవసరంలేదు. శారీరక అవసరాలు తప్పిస్తే చాలా విషయాలలో మన ఆనందం నిజంగా మనకు అవి వున్నాయన్న ఎరుక మీద ఆధారపడుతుందిగానీ వాటిని పొందడం వలన కాదు. బ్యాంకులో కొంత డబ్బు వున్నదన్న ఆలోచనే మనకానందాన్నిస్తుంది. మనం నిజంగా ఒక రూపాయి అయినా బ్యాంకు నుంచి (డ్రా) తీసుకుంటామా లేదా అన్నది వేరే విషయం. డబ్బు బ్యాంకులో వున్నది. "అది నాది" అన్నది చాలు. మనం చాలా నిశ్చింతగా, ఆనందంగా వుంటాము. అది (డబ్బు) అక్కడ – మనమిక్కడ. అది అక్కడ – మనమిక్కడ వున్నాము. (నవ్వులు). దీక్షిత్ పనిపిల్లలాగా: ఆమె చీర ధరించలేదు. మనము డబ్బును ఖర్చుపెట్టలేదు. అది బ్యాంకులో 5, 10, 15 సంవత్సరాలు డిపాజిట్ రూపంలో ఉంటుంది. అయినా మనమానందంగా ఉంటాము.

**గురువుగారు:** ఒక్కసారి "అవును. ఆయన నావారు, ఆయన నాకు చెందినవారు. నేను ఆయనకు చెందినవాడిని" అనే ఎరుక వుంటే అది చాలు. (గురువుగారు ఆయన కూర్చుని వున్న గదినుద్దేశించి) నీవు ఇక్కడ కూర్చున్నా క్రింది అంతస్థులోనైనా, ఒకే గదిలోనైనా రెండు గదులలోనైనా అక్కడ మధ్యన ఒక గోడ వున్నా సరే – తేడా ఏమీలేదు. నేనిక్కడ కూర్చొనివున్నాను. నీవక్కడ ప్రక్కగదిలోనే కూర్చొని వున్నావు. కానీ

మనకు గోడ చాలా ముఖ్యమైనదిగా కనబడుతుంది. అందుకే బాబా "అడ్డుగోడను తొలగించ"మన్నారు. నీవక్కడ - నేనిక్కడ. దీక్షిత్ పనిపిల్ల యొక్క చీరలాగా -నేనిక్కడ వున్నాను.



**గురువుగారు:** నీ యధార్థమైన ఆనందానుభూతి నీవు అనుభవించే వస్తువుపై ఆధారపడిలేదు. దానిపట్ల నీకున్న దృక్పథం (నీ తీరు), ఆ విషయం పట్ల నీ వ్యవహార సరళి, అదే నీకు ఆనందాన్నిస్తుంది. అందుకే దీక్షిత్ పనిపిల్ల చాలా ఆనందం పొంది సంతోషంతో నృత్యం చేసింది. ఉదాహరణకు ఒక వ్యక్తి ఉద్యోగం కోసం చూస్తున్నాడనుకొందాం. అతనికి అది అత్యవసరం. తర్వాత ఒకరోజు అతనికి ఉద్యోగం వస్తుంది. మొదటి జీతం అతనింకా అందుకోలేదు. అతనికి ఫలానా జీతంతో ఉద్యోగమొచ్చిందని, ఈ-మెయిల్ సమాచారం మాత్రం అందింది, అంతే. కానీ అతను ఎంతో ఆనందంగా వున్నాడు. అతనికి ఏమి జరిగింది? ఆ ఎరుకే ఉద్యోగమున్నది, దానిని తాను పొందగలడనే విషయం అతనిని ఆనందింపజేసింది. అదే - ఆ ఎరుకే అతనికి నిజమైన ఆనందాన్నిచ్చింది. అలాగే ఈ ప్రాపంచిక విషయాల పట్ల మాత్రమే కాదు - అదే ఎరుక నీవు వెళ్లి సాయిబాబా వంటి ఒక సద్గురువును కలిసినపుడు కూడా వుంటుంది. "అవును - ఇది నా ఈ-మెయిల్ ఉత్తరం (నవ్వులు) నాకు దక్కింది" అనే ఎరుక నీకు చాలా ఆనందాన్నివ్వాలి. నిర్వాణము, ముక్తి, సాక్షాత్కారము -ఏదైనా సరే నీకింకా అందుబాటులోకి రాకపోయినప్పటికీ (ఇంకా పొందనప్పటికీ) ఆ అవకాశము, ఆ వాగ్దానము, అవును నాకు బాబా వున్నారు అనే ఖచ్చితమైన నమ్మకము నిన్ను ఆనందంగా ఉంచాలి. అందుకని మనమంతా కాకాసాహెబ్ దీక్షిత్ పనిపిల్లలాగా ఉందాము. (నవ్వులు) ఆమెకు చక్కగా చీర వున్నది. మనకు బాబా వున్నారు ఇంక దుఃఖానికి తావేది? కలతచెందడానికేమున్నది? జీవితాన్ని సంతోషంగా అనుభవిద్దాం. అనుక్షణం ఆనందాన్ని ఆస్వాదిద్దాం. నృత్యం చేద్దాం.

**గురువుగారు:** ఈ సత్సంగాలు మొదలైనవి నీదైన నీ జీవితాన్ని నేర్పుతో ఎలా ఆనందమయం చేసుకోవాలో నీవు నేర్చుకొనేలా నీకు నేర్పడానికే వున్నాయి. అప్పుడు జీవంలేని వెనుకటి పాతక్షణాలు పోయి నీ జీవితం నిత్యనూతనంగా వుంటుంది. ప్రతిక్షణం - అనుక్షణం నీ జీవితం కొత్తగా వుంటుంది.

**గురువుగారు:** బాబా మీకిచ్చిన అందమైన జీవితాన్ని అర్థం చేసుకొని (గుర్తెరిగి) ఆనందంగా ఉండడానికి ప్రయత్నించండి. అది ఆయన (బాబా) కృపాస్వరూపం. మీలో ప్రతి ఒక్కరిని బాబా ఎలా వుంచారు, ఎక్కడ వుంచారు (ఎలా మలచారు) ఆయన మీకు ఏమి ప్రసాదించారు అనేది మీలో ప్రతి ఒక్కరిలో నేను దర్శించుకుంటాను. మీరు ఇంకా ఎక్కువ కోరుకుంటే ఎక్కువ ఇస్తాను. కానీ బాబా ఇచ్చిన దానిని ఆనందంతో అనుభవించండి, ఆస్వాదించండి!



**గురువుగారు:** తెలుసుకోండి. ఆస్వాదించండి. ఉల్లాసంగా బాబా అనే ఆనందంతో పొంగిపోండి. ఆ ఆనందాన్ని నేను చూడాలి. ఆ సంతోషం నేను చూస్తే నేనూ సంతోష పడతాను. బాబా అనే ప్రేమలో ప్రేమ అనే ఆ ఆనందంతో ప్రకాశిస్తూ మీ అందరి ముఖారవిందాలు విప్పారివుంటాయి. **బాబా మీవాడన్న నమ్మకము, నీవు బాబాకు చెందినవాడవన్న అనన్యత్వము వున్న ఆ రాజసం ఉండాలి.** మనమంతా శ్రీసాయినాథ్ మహరాజ్ కుమారులం, కుమార్తెలం. ఆయన మహారాజు. (గురువుగారు నవ్వుతూ) మనమూ ఆ రాజవంశీకులమే. మనము రాకుమారులం. రాకుమార్తెలం. ***– శరశ్చంద్రికలు ఫిబ్రవరి 2011***

# ప్రకృతి స్వభావం

ఈ సంభాషణ 2009, శిరిడీ, గురుచరణ్‌లో జరిగింది. ఆ రోజు నేను మాట్లాడిన ఒక వ్యక్తి గురించి నేను నాన్నగారితో చెబుతున్నాను. ఆ వ్యక్తి నాతో తాను మనుషుల మధ్య ఉండటం కన్నా ఒంటరిగా ప్రకృతికి దగ్గరగా ఉండటాన్ని ఇష్టపడతానని, శిరిడీలో తాను సాధారణంగా ఉండేదానికన్నా ఎక్కువమంది మనుషుల మధ్యన ఉన్నానని చెప్పాడు. ఈ మాటకు నాన్నగారు నవ్వి "నిజంగా ప్రకృతిని అర్థం చేసుకున్న వారికి, ఇంతమంది మధ్యలో ఉండటం కూడా అద్భుతంగానే ఉంటుంది. ఇక్కడుండే మనుషులంతా ప్రకృతి కాదా? ప్రకృతి ప్రతిరూపాలెన్నో ఇక్కడ, అక్కడ, మనచుట్టూ ఉన్నాయి. కొన్ని ఆనందంగా, కొన్ని విషాదంగా నడుస్తూ మాట్లాడుతూ, ఎన్నో ఆలోచనలతో, భావోద్వేగాలతో, రకరకాల చర్యలతో, ప్రతిచర్యలతో మనముందే కదిలి పోతున్నాయి. సరిగ్గా 'చూడటం' తెలిసిన వారికి ఇంతమంది మధ్యలో ఉండటం కూడా ప్రకృతి మధ్యలో ఉండటం లాంటిదే! ఎవరైనా దీనిని ఆస్వాదించకుండా ఎలా ఉండగలరు?"

**శ్రుతి :** మీ ఉద్దేశ్యంలో "సరిగ్గా చూడటం తెలియడం" అంటే ఏమిటి? నాతో మాట్లాడిన ఆ వ్యక్తి దృష్టిలో ప్రకృతంటే అడవులు, పర్వతాలు, నదులు ఇలాంటివి–మనుషులు కాదు. కానీ మీరు– 'ప్రకృతి', 'మనుషులు' ఈ రెండు పదాలను ఒకే అర్థంలో చెబుతున్నారు. అవి రెండూ వేరు వేరు కదా, కాదా?

**గురువుగారు** : సరే నేను నీకు ఒక వ్యక్తి గురించిన ఉదాహరణ ఇస్తాను. ఆ వ్యక్తి తాను బాబాను చూసినపుడు బాబా కళ్ళలో ఎటువంటి క్రియాత్మకత కనిపించలేదని చెప్పాడు. నేను ఆ వ్యక్తిని, "మీకు ఒక ఎడారిని చూసినపుడు అందులో ఏదైనా క్రియాత్మకత కనిపిస్తుందా?" అని అడిగాను.

ఎడారిలో ఎటువంటి జీవమూ ఉండదు, అది దుస్సహంగా ఉంటుంది. నీటి స్పర్శే ఉండదు. కానీ దానిని చూడటాన్ని అందరూ ఇష్టపడతారు. చాలామంది ఎడారులను చూడటానికి వెళతారు. అక్కడ ప్రకృతిని చూసి ఆనందిస్తారు. వాళ్ళంతా ఎడారిని చూసి ఎలా ఆనందించగలుగుతారు? ఆ ఎడారిలో ఏ జీవం ఉంది? అటువంటి జీవంలేని, పొడిబారిన ప్రదేశంలో కూడా వారికి ప్రకృతి కనిపిస్తుంది. అందుకే ఎడారులను చూసి, వాటి వైశాల్యాన్ని చూసి అబ్బురపడతారు. నిజంగా "చూడటం" తెలిస్తే ఎడారి సైతం సచేతనంగా కనిపిస్తుంది.



బాబా కళ్ళలోనికి చూసినపుడు ప్రతి ఒక్కరికీ ఏదో విభిన్నత్వం కనిపిస్తుంది. కొంతమంది ఓ పసిబిడ్డను చూస్తారు. కొంతమంది ఒక సాగరాన్ని చూస్తారు. ఇంకొందరు పర్వతాలను చూస్తారు. కొందరు సుందరమైన ఉద్యానవనాల్ని చూస్తారు. కొందరు పువ్వులను చూస్తారు. కొందరు బాధను, కొందరు ప్రేమను, కొందరు కోపాన్ని, కొందరు నిరసనను చూస్తారు. వాళ్ళు ఎలా చూస్తారు. వారికి ఆయనకు గల సంబంధం ఏమిటనే దానిమీద ఇది ఆధారపడి ఉంటుంది. ఎవర్రికైనా ఇవేమీ కనిపించకుండా బాబా కళ్ళలో ఒక నిర్లిప్తమైన చూపు కనబడితే అది కూడా అందంగానే ఉంటుంది.

నిజానికి ప్రకృతి అని పిలవబడే దానికీ, నీకూ మధ్యన ఉండే సంబంధం ఏమిటి? నువ్వు ఒక పర్వతాన్ని చూసి ఆనందిస్తావు. అది నీతో మాట్లాడుతుందా? నీకు ఆహ్వానం పలుకుతుందా? నీతో సంబంధాన్ని నెరుపుతుందా? ఆ పర్వతం నిశ్చలంగా ఉంది. అంతే, కానీ నువ్వు దానిని చూసి ఆనందిస్తున్నావు. ఒక పువ్వును తీసుకో – అది తన సహజసిద్ధ స్వభావంతో అలా ఉంటుంది. అంతే. దానికి నీతో ఎటువంటి సంబంధమూ లేదు. కానీ నువ్వు ఆ పువ్వును ప్రేమించగలుగుతున్నావు. దానికి నీకు ఏం సంబంధం ఉంది? అది నిన్ను రారమ్మని పిలుస్తోందా" (నవ్వుతూ). అది నీతో మాట్లాడుతుందా? "నువ్వే" ఒక జడమైన వస్తువు పట్ల ప్రతిస్పందిస్తున్నావు.

ఉదాహరణకు వర్డ్స్‌వర్త్ కవిత్వాన్ని తీసుకోండి. వర్డ్స్‌వర్త్ ఒక గొప్ప కవి కావడానికి కారణం ఆయన అంతరంగిక ప్రకృతికి అతని కవిత్వం అద్దంపట్టడమే. మీరు అతని కవితలు చదివితే, ఉదాహరణకు "డాఫోడిల్", అతను కేవలం ఆ పువ్వును "ఓహ్, డాఫోడిల్ ఈ రంగులో ఉంది, ఆ ఆకారంలో ఉంది అని మాత్రమే వర్ణించలేదు, అతను ఆ వివరాల జోలికి వెళ్ళలేదు. ప్రారంభంలో అతను "డాఫోడిల్ డాఫోడిల్ " అని రెండుసార్లు అని వెంటనే అతను అంతర్ముఖుడైపోతాడు.



**శ్రుతి :** Tintern Abbey దీనికి మరొక ఉదాహరణ

**గురువుగారు :** కేవలం Tintern Abbey మాత్రమే కాదు, ఆయన కవితలన్నీ అటువంటివే. అందుకనే పండితులు ఆయనను ప్రకృతికవుల వర్గంలో కాకుండా మార్మికకవుల వర్గంలో చేర్చారు. ఆయనకు ప్రకృతి కేవలం ప్రేరకం మాత్రమే. ప్రకృతి అతనిని అంతర్ముఖుణ్ణి చేయడానికి కావలసిన ప్రేరణను ఇస్తుంది. అతను ప్రకృతిని దానికోసమే ఉపయోగపెట్టుకుంటాడు. రకరకాల వ్యక్తులకు ఈ ప్రేరణ రకరకాలుగా ఉంటుంది. వర్డ్స్‌వర్త్ విషయంలో ప్రకృతి ఆ ప్రేరకం, మరికొందరికి ఆ ప్రేరకం బాబా కావచ్చు, ఇంకొందరికి బహుశా అది నేను కావచ్చు.

ఆ “ఏదో ఒక దానిని” మనం ప్రేరకంగా ఉపయోగపెట్టుకున్నంత వరకు మనమంతా వర్డ్స్‌వర్త్‌లమే! కేవలం డాఫోడిల్ లేదా Tintern Abbey మాత్రమే మనల్ని అంతర్ముఖులను చేయాలని లేదు. నాకు ఆ ప్రేరకం బాబా. వర్డ్స్‌వర్త్ విషయంలో ప్రకృతి ప్రేరకం కాబట్టి ఆయనను ప్రకృతికవని, ప్రకృతి ఆరాధకుడని, ప్రకృతి ప్రేమికుడని అన్నారు. నా విషయంలో ఆ ప్రేరకం బాబా కాబట్టి నన్ను నేను బాబా భక్తునిగా భావించుకుంటాను. ఈ రెండూ ఒకటే.

అతడిని ప్రకృతికవి అంటారు కనుక ఒక దేశదిమ్మరిగా అతను చెట్లు, చేమల వెంబడి తిరుగుతూ కాలం వెళ్ళబుచ్చుతుంటాడని కాదు (నవ్వుతూ)....

అందుకే ఎవరైనా నా దగ్గరకు వచ్చి తాము ప్రకృతి ప్రేమికులం అని చెప్తే నాకు నవ్వు వస్తుంది. ప్రకృతి సాంగత్యంలోనికి పోకూడదని నా ఉద్దేశ్యం కాదు. కానీ ఆ ప్రకృతి మనలోని ప్రకృతిని జాగృతం చేయాలి. మనం ప్రకృతి సాన్నిధ్యంలోనికి పోవడం ద్వారా ఈ పని జరగాలి లేకపోతే అది కేవలం ఒక అహేతుకమైన కల్పన మాత్రమే. ఒకవేళ అది మనలో ఆ భావాన్ని కలిగిస్తే అప్పుడు మనం ప్రకృతిలోని బాహ్య సౌందర్యాన్ని ఆంతర్యంలో ప్రతిబింబించేలా చేసుకోవడానికి ప్రయత్నించే నిజమైన ప్రకృతి ప్రేమికులం అవుతాము.

**శ్రుతి :** నా ఆంతర్యంలో ఆ అందం ప్రతిబింబించిందనుకుందాం. ఆ ప్రేరకం నిజమైన ప్రేరకమని నాకెలా తెలుస్తుంది. అది కేవలం అందాన్ని చూసినపుడు కలిగే విస్మయం / సంభ్రమం కావచ్చుకదా! అది నిజమైన ప్రేరకమని నాకెప్పుడు తెలుస్తుంది?



**గురువుగారు :** నీకు ప్రకృతి నిజంగా ప్రేరకమైనప్పుడు అది నీ అంతరంగికమైన ప్రకృతిని ప్రతిబింబించడంతో ఆగదు. ఆ బాహ్య ప్రకృతి నీ అంతరంగంలోనికి విస్తరిస్తుంది. నీకు ప్రకృతి యొక్క స్వభావం తెలిస్తే, అప్పుడు నువ్వు అంతటా ఆ ప్రకృతినే చూస్తావు. అలాంటప్పుడు ప్రకృతి కానీ విషయం ఉంటే ఒకటి చెప్పు? ప్రకృతంటే ఒక అందమైన దృశ్యాలు, మైదానాలు, ఉద్యానవనాలు, సముద్రాలు, పర్వతాలు మాత్రమే కాదు. కేవలం ఇటువంటివి మాత్రమే ప్రకృతి అనే పొరపాటు భావనలో ఉండవద్దు. నిజమైన ప్రకృతి మన అంతరంగాన్ని / భావాలను ప్రతిబింబిస్తుంది.

సాధారణంగా అందరూ అంగీకరించిన భావాలు ప్రతి ఒక్కరికీ ఉన్నాయి. వాటిని ధ్వంసం చేయాలి! ఆ భావాల గాడిలో పడకుండా ఉండటానికి ప్రయత్నించు. విభిన్నంగా ఆలోచించు. అప్పుడది నిజంగా ఆలోచించడమవుతుంది. ఎవరైనా ప్రకృతి గురించి ఆలోచిస్తే అది ఈ (తమ హృదయాన్ని చూపుతూ) ప్రకృతి ఎందుకు కాదు? నిజానికి ఇది (మళ్ళీ తమ హృదయాన్ని చూపుతూ) ప్రకృతి కాకపోతే మరి ప్రకృతి అంటే ఏమిటి? అందుకే నేను నిన్ను పదాలకు పరిమితం కావద్దు అని చెబుతాను. నేను కేవలం 'ఆత్మ' మరియు 'పరమాత్మ' లాంటి వాటి గురించి మాత్రమే చెప్పడం లేదు. రోజూవారీ వాడే పదాల గురించి కూడా చెబుతున్నాను. మనం మన చుట్టూ ఉండే చాలా విషయాలను ఆలోచించకుండానే అంగీకరించేస్తాం. మనం చేసే ప్రతి పనీ మాట్లాడే ప్రతిమాటా అంతే. కేవలం ప్రకృతి గురించి మాత్రమే ఎందుకు? మొట్టమొదట అసలు ప్రకృతి అనే పదానికి అర్థమేమిటి? సహజసిద్ధమైనది ప్రతిదీ ప్రకృతే. మరి మనుషులు ప్రకృతి కాదా? నీకిప్పుడు అర్థమైందా, నేనెందుకు మనుషులు మధ్య ఉండటం కూడా ప్రకృతి మధ్యలో ఉండటంవంటిదేనని చెప్పానో!

–సాయినాథుని శ్రుతి

**సమర్పణ**

నాకు సమర్పణ చెందుటకు సులభమగు మార్గమొకటున్నది. నీవు తిను తిండి నాకు సమర్పణముగా తినుము. నీ వినికిడి నా సమర్పణముగా వినుము. నీవు చూచునది నన్నే అని గుర్తుంచుకొనుము. నీవు మాట్లాడునది నాతోనే అని తలచుము. నీవు స్పృశించునది కూడా నన్నే. నీవు భోగించునది నన్నే.

అట్లు నన్ను చూచుట, వినుట, స్పృశించుట, భోగించుట పరిపూర్ణమైనచో నేను తప్ప ఇంకేదియు ఉండదు. ఇది నిజమగు పూజ. ఈ పూజకు తతంగములు ఏవియూ లేవు. నీవు లేచిన క్షణం నుండి నిదురించు క్షణము వరకు నిత్య పూజ చేయుచునే యుందువు. ఇట్లయినా నీ మెలకువలోను, నిదురలోను నేనే యుందును.

–సాయిసూక్తులు



## భక్తి గొప్పది - కులం కాదు.

ఒకానొక సందర్భంలో మహాస్వామివారి దర్శనం కొరకు నా మిత్రునితో కలసి మహారాష్ట్రలో ఒక పట్టణానికి వెళ్ళాను. కాని మహాస్వామివారు మూడురోజుల ముందే అక్కడి నుండి బయలుదేరి, ఆ ఊరి పరిసర ప్రాంతాలలో ఉన్న నదీపరివాహక ప్రాంతంలోని మామిడితోపులో విడిది చేసినట్టు తెలుసుకొని, అక్కడికి వెళ్లాము. మేము అక్కడికి వెళ్ళగానే ఆ మామిడితోపులో మహాస్వామివారి దర్శనానికి వచ్చే వారికి చేసిన అన్ని ఏర్పాట్లు చూసి ఆశ్చర్యపోయాము.

మహాస్వామివారు ఇక్కడ బస చేయడానికి కారణం మాకు మఠం అధికారులు చెప్పారు. మహాస్వామివారు ఇంతకుముందు పట్టణంలో ఉండి రోజూ పూజ చేసేవారు. ఆ ఆరాధనను చూడటానికి ఒక మధ్యవయస్కుడు వచ్చి గుంపులో చివర నిలబడి పూజను చూసి వెళ్లిపోయేవాడు. ఎప్పుడూ మహాస్వామి వద్దకు రాలేదు. శ్రీవారు ఇది గమనించి ఒకరోజు దగ్గరకు పిలిచి ఏమి కావాలి అని అడిగారు.

అతను మహాస్వామి వారితో “నేను ఇక్కడికి రోజు కూలి చేసుకోవడానికి వచ్చాను. బాగా పనిచేస్తూ మేస్త్రిగా మారి, ఒక చిన్న కాంట్రాక్టర్ అయ్యాను. నేను మీకు చేసిన ప్రార్థనలు ఫలించి, పెద్ద కాంట్రాక్టర్ అయ్యి, బాగా డబ్బు సంపాదించి, ఈ పట్టణం బయట చాలా స్థలం కొన్నాను. నా అదృష్టవశమున మీరు ఈ ఊరికి వస్తున్నారని తెలిసింది. మిమ్మల్ని మా ఇంటికి ఆహ్వానించి, మీ పావన పాదస్పర్శతో మా జన్మలు తరింపచేసుకోవాలని అనుకునేవాణ్ణి. కానీ నేను తక్కువజాతి వాడిని కావడం వలన మా ఇంటికి మీరు రారు అని ఇక్కడ ఉన్నవారందరూ చెప్పారు. ప్రతిరోజూ మిమ్మల్ని ఆహ్వానించాలనే ఇక్కడికి వచ్చేవాడిని. కానీ మీరు ఎక్కడ తిరస్కరిస్తారో అని ధైర్యం చాలక మిమ్మల్ని అడగలేదు” అని చెప్పాడు.

మహాస్వామివారు అతనితో “నేను ఈ ఊరికి వచ్చినదే నిన్ను చూడటానికి. నేను మీ ఇంటికి రావడమే కాదు మొత్తం పీఠం మరియు ఆరాధన కూడా మీ స్థలంలోకి ఈ రోజే మారుస్తాం” అని అన్నారు. మహాస్వామివారు ఆ మామిడి తోపులో పది రోజులు ఉండి పూజ చేస్తూ అతణ్ణి ఆశీర్వదించారు.

# కులాల కుళ్ళు

**గురుబంధువు :** సోషల్‌గా మనము అవతలకి వెళ్ళినపుడు ఇతరులతో మమేకం అయినపుడు కుల పట్టింపులు మరియు ఇతర పట్టింపులు వస్తుంటాయి కదా. సాయిభక్తులుగా మనం దాన్ని ఎట్లా అన్వయించుకోవాలి?

**గురువుగారు :** అవి వస్తున్నాయి అనంటే సాయిభక్తుడు కాదని అర్థం.

**గురుబంధువు :** వేరే వాళ్ళతో ఇంటరాక్ట్ అయినపుడు?

ఎవ్వరితో ఇంటరాక్ట్ అయినాసరే. కుల పట్టింపులు వస్తున్నాయి అనంటే మాత్రం మనం ఇంకా సాయిభక్తుడు కాలేదని అర్థం. ప్రయత్నిస్తున్నాం కావడానికి. ఇవన్నీ ఉన్నాయి కానీ, నువ్వు సాయిబాబా (భక్తుడివి) అయితే మాత్రం ఏమి? మన కులం ప్రకారం మనం చేసుకుంటాం. మన కులం వాళ్లమంతా కలసి సాయిపథంలో ఒక గ్రూప్ తయారుచేస్తాము అని అంటారు. అలా సాయిపథంలో మళ్ళా కుల సంఘములు తయారవుతాయి. లేకపోతే జడ్జ్ చెయ్యటం. చూడు గురువుగారి దగ్గర ఎవరున్నారో ఎక్కువ లెక్కయ్యండి అని అంటారు. అసలు ఆలోచన కూడా రాదు నాకు. ............... ఒక టైమ్‌లో ఒకరుంటారు. ఇంకో టైమ్‌లో ఇంకొకరుంటారు. ఇంకో టైమ్‌లో ఇంకొకరుంటారు. వాళ్ళ వాళ్ళ ఆర్తినిబట్టి అక్కడుండే అవకాశాన్ని బట్టి ఉంటుంది. అదిగో చూడు ఇపుడు కార్లో బయలుదేరినారు కదా చూడు, ఎవరెవరున్నారో చూడు, లెక్కెయ్యి. ఇది అక్కడుండే పరిస్థితి. ఆ దరిద్రాలకిక అంతులేదు. ఎందుకంటే మనకు అంత అలవాటు అయిపోయింది మన థింకింగ్ ఆ టైంలో ఆలోచించడం. మనిషిని, మనిషిలాగా చూడకుండా వాడు ఏమిటోడు అని చూడటం. రైల్లో కూర్చోగానే మీరు ఏమిటోళ్ళు? అని అడుగుతారు మొదట.



**గురుబంధువు :** అప్పుడు ఏమి చెప్పాలి గురువుగారు?

**గురువుగారు :** నేను సాయిభక్తుణ్ణి అని చెప్పు. నాకు కులమంటే అసహ్యమండీ. నాకు కులమేమీ లేదు. నాకేదో కులముంది కానీ, ఆ కులం మీద నాకేమీ ఇది లేదు. మీరు ఏమిటోళ్ళు అని అడిగారు కనుక మేము సాయిబాబా ఓళ్ళు అని చెప్పు.

**కులాల కుళ్ళు - మతాల మళ్ళు మానవతకు సంకెళ్ళు. -శ్రీబాబూజీ**

**గురుబంధువు :** ఎక్కడడిగినా మనం ఆ విధంగా చెప్పగలిగి ఉండాలి కదండీ.

**గురువుగారు :** ఏం ఎక్కడడిగినా చెప్పడానికి భయమా ఏమైనా?

**గురుబంధువు :** లేదు సార్, సాయిపథంలోనే కాకుండా బయట ఎక్కడైనా...

**గురువుగారు :** బయట ఎక్కడైనా చెప్పాలి, ఇంకా బయటే చెప్పాలి ఎక్కువ. సాయిపథంలోకాదు. ముందు వాళ్ళకు అది నచ్చదు. నిన్ను లాగడానికి ప్రయత్నం చేస్తారు. నిన్నొక పిచ్చోడనుకుంటారు. అనుకోని. కానీ రేప్పొద్దున్న మళ్ళీ నీ దగ్గరకి వస్తారు. నీలో ఉండే మనోస్థైర్యంని చూసి ఇక్కడన్నీ మాట్లాడుతూ బయటకి పోయిన తరువాత మనం మనం ఒకటే కదా! ఎందుకంటే కొన్ని లాభాలు ఉంటాయి. కొన్ని సొసైటీస్‌లో కొన్ని దగ్గర ఏదన్నా ఒక జాబ్ కావాలన్నా, అక్కడ ఒక ప్లేస్‌మెంట్ కావాలన్నా, ఆ ప్లేస్‌మెంట్ ఇచ్చే వ్యక్తి నీ కులం వాడు అయ్యుంటే, కొంచెం మనోళ్ళు, మనోళ్ళు చూసుకోకపోతే ఎట్లా సార్ అని అంటాం మళ్ళీ. అట్లా ఉపయోగాలు కొన్ని ఉపయోగపెట్టుకుంటాము. వీలైనంతవరకు అట్లాంటి ఉపయోగ పెట్టుకోవడాలు ఆపెయ్యండి. ఒక లాభమొచ్చినా మనం ఉపయోగపెట్టుకోవడానికి సిద్ధపడుంటే, మన ఇది చూసి బాబానే ఇవ్వాలని అనుకుంటే ఇస్తారు. లేకపోతే ఈ కక్కుర్తికి, ఈ దరిద్రానికి అంతం లేదు. ఇంతవరకు మనకు ఏమీ తెలియకుండా మన ప్రమేయమేమీ లేకుండా ఒక కులంలో పుట్టేశాము. మనకంతకంటే వేరే ఏమీ అర్హత లేనట్టు. నువ్వు ఏమిటి అనంటే, నేనొక కమ్మ, బ్రాహ్మణ్ణి, రెడ్డిని అని చెప్పుకుంటున్నా వంటే సిగ్గుపడొద్దా మనం? నీకంతకంటే ఏమీ లేదన్నమాట వేరే అర్హత. నీకున్న అర్హత అదొక్కటే.

**గురుబంధువు :** అసలు ఇవన్నీ ఎట్లా వచ్చాయి సార్?

**గురువుగారు :** అబ్బో! ఆ ప్రశ్న ఎందుకయ్యా? దరిద్రాలు ఎట్లావస్తే ఏంటంటా, మన మనసులో ఎన్ని దరిద్రాలుంటే అన్ని దరిద్రాలు పుట్టిస్తాము. అది...... బురదలో నుంచి ఎట్లా బుడగలొస్తాయనంటే, ఏం చెప్తాం చెప్పు. బురద కనుక వస్తాయి బుడగలు. ఈ బురదలో నుంచి వచ్చిన బుడగల్లాంటివి.

**గురుబంధువు :** ఇండియాలోనే ఎక్కువ...

**గురువుగారు :** ఎక్కువ కాదు, ఇండియాలోనే ఉంది. ఇంకెక్కడా లేదు. ఎక్కడున్నాయయ్యా ఈ కులాలు. ప్రపంచంలో ఎక్కడా లేవు.

**గురుబంధువు :** సత్సంగానికి ఎవరైనా వెస్ట్ వాళ్ళు వచ్చినపుడు బాబా ఏ మతానికి చెందినవారు అని అడిగినపుడు బాబా ఏ మతం కాదు అని చెప్తాము.

**గురువుగారు :** చెప్పు.

– ***శ్రీబాబూజీ***

